www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 11 మే 2024 8 పేజీలు

వైఎస్‌ఆర్

అన్నమయ్య

ప్రజలకు అభివాదం చేస్తున్న సిఎం వైఎస్‌.జగన్

పేదల భవిష్యత్తు కోసం
యజ్ఞం చేశా

కడప జిల్లా రుణం తీర్చుకోలేనిది
రోడ్‌షోలో ముఖ్యమంత్రి జగన్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సచివాలయాల్లో పౌరసేవలు, వాలంటీర్లతో అవ్వాతాతలకు ఇంటికే వచ్చి పెన్షన్ ఇవ్వడం, ఇంటికే వచ్చి రేషన్ పంపిణీ చేయడం, ఆర్బీకే వ్యవస్థ, విలేజ్ క్లినిక్, నాడు-నేడుతో స్కూళ్లు, ఇంగ్లీష్ మీడియం, మహిళా పోలీస్, ఫోన్లలో దిశా యాప్ వంటి సేవలతో పేదల భవిష్యత్తు కోసం యజ్ఞం చేశానని ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరం లోని పొట్టిశ్రీరాములు కూడలిలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ కడప జిల్లా ప్రజల రుణం తీర్చుకో లేనిదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇబ్బంది పెడితే, ఇండిపె ఒడెంట్‌గా 5.45 లక్షల ఓట్ల మెజార్టీతో ఆదుకుందని చెప్పారు. పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేస్తుండగా, పార్లమెంట్ మొత్తం ఎవరీ జగన్ అని చూసిందని తెలి పారు. టిడిపి అధ్యక్షులు చంద్రబాబు మైనార్టీ రిజర్వేషన్లకు వ్యతిరేకమైన ఎన్‌డిఎ కూటమితోనే ఉంటాడట, ముస్లిమ్ రిజర్వే షన్లను బాహాటంగా వ్యతిరేకిస్తున్న బిజెపితోనే జతకట్టడం ఆయనకే చెల్లిందని ఎద్దేవా చేశారు. ఎన్‌ఆర్‌సి, సిఎఎ వంటి అంశాల్లోనూ తాను ముస్లిములకు మద్దతుగా ఉంటానని తెలిపారు. 59 నెలల పాలనా కాలంలో ఇంగ్లీష్ మీడియం మొదలుకుని ఐబి సిలబస్ వరకు ప్రయాణించామని తెలిపారు. ఉన్నత చదువులకు 2లో

అరాచక పాలనకు
రోజులు దగ్గరపడ్డాయి

- ఎన్నికల ప్రచారంలో పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల

ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తున్న వైఎస్. షర్మిల

ప్రజాశక్తి - మైలవరం/చాపాడు

వైసిపి అరాచక పాలనకు పాలనకు రోజులు దగ్గర పడ్డాయని పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల అన్నారు. శుక్రవారం జమ్మలమడుగు, మైదుకూరు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన సభల్లో షర్మిల మాట్లాడుతూ రాష్ట్రంలో 10 ఏళ్లుగా విభజన హామీలు ఒక్కటి కూడా నెరవేరలేదన్నారు. మొదటి 5 ఏళ్లు బాబు, తర్వాత జగన్ మోసం చేశారని తెలిపారు. కడప స్టీల్ ప్రాజెక్ట్ శంకుస్థాపన ప్రాజెక్ట్‌గా మార్చారన్నారు. కడప స్టీల్ ప్లాంట్ వచ్చి ఉంటే లక్షల్లో ఉద్యోగాలు ఉండేవని తెలిపారు. కడప స్టీల్ కోసం ఏనాడూ ఉద్యమం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ చేసిన పార్టీ, కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటన చేసిన పార్టీ అని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని చెప్పారు. బాబు, జగన్ హోదా మీద మోసం చేశారని తెలిపారు. కనీసం రాజధాని కూడా కట్టలేక పోయారన్నారు. జగన్ ప్రభుత్వం ధరలు, ఛార్జీలు, పన్నులు పెంచి ప్రజల రక్తం తాగుతున్నాడన్నారు. ధరల వాత, ఛార్జీల మోత అన్న చందంగా జగన్ పాలన తయారైందన్నారు. మద్యం, ఇసుక, సిమెంట్, పెట్రోలు, డీజిల్, నిత్యావసర వస్తువులు ధరలు పెంచడంతో పాటు ఆర్టీసీ, విద్యుత్ ఛార్జీలు ద్వారా 5 సంవత్సరాల్లో జగన్ ప్రభుత్వం ప్రజలపై రూ.3 లక్షల కోట్లు అదనపు భారం మోపిందన్నారు. జగన్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చింది గోరంత లాక్కొన్నది కొండంతన్నారు. వైసిపి ఇచ్చిన ఇళ్లు పిచ్చుక గుళ్లతో సమానమన్నారు. ఒక కుటుంబం కాపురం చేయడానికి ఇళ్లు పనికిరావని పేర్కొన్నారు. నమ్మించి మోసగించడం జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య అని తెలిపారు.. రైతులను, రైతు కూలీలను, మహిళలను, మందు బాబులను, ఉద్యోగులను, అగ్రిగోల్డ్ బాధితులను, సర్పంచ్‌లను, కాంట్రాక్టులను ఇలా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు మోసం చేశారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మైదుకూరు అసెంబ్లీ అభ్యర్థి జి.శ్రీరాములు, ఇండియా వేదిక నాయకులు పాల్గొన్నారు.

నేటితో
ప్రచారానికి తెర

- 48 గంటల పాటు ప్రచారంపై ఆంక్షలు
- సభలు, సమావేశాలు, రోడ్‌షోలు బంద్
- నేటి సాయంత్రం 5 వరకే సమయం
- నోట్లతో ఓట్లకు ఎర

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఈ నెల 13 తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు శనివారం సాయంత్రం ఐదు గంటలతో ప్రచారం ముగుస్తోంది. పోలింగ్ ముగిసే వరకు 48 గంటల పాటు అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎటువంటి ఎన్నికల ప్రచారం నిర్వహించకూడదు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుంచి అభ్యర్థులు బహిరంగ సభలు, ఊరేగింపులు, రోడ్‌షోలు నిర్వహించరాదు. ఏప్రిల్ 18న ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. జిల్లా అధికార యంత్రాంగం సుమారు 23 రోజులపాటు నామినేషన్ల ఘట్టం దగ్గర నుంచి స్క్రూటినీ, ఉపసంహరణ, తుది అభ్యర్థుల జాబితా ప్రకటన వరకు ఎన్నికల షెడ్యూల్‌ను నిర్వహించింది. కడప, అన్నమయ్య జిల్లాలోని రాజకీయ పార్టీల తరుపున బరిలో నిలిచిన వందలాది మంది అభ్యర్థులు తనదైన శైలిలో ఎన్నికల ప్రచారాలను హోరెత్తించారు. 13న నిర్వహించే పోలింగ్‌కు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ చేసింది. పోలింగ్ ప్రక్రియ ఊపందుకున్న నేప థ్యంలో ఎన్నికల బరిలో నిలిచిన వందలాది మంది అభ్యర్థులు పోలింగ్‌కు సంబంధించిన కస రత్తుపై దృష్టి సారించాల్సి ఉంది. అన్ని రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు పోలింగ్ బూతుల్లో ఏజెంట్లు నియామకం దగ్గర నుంచి పోలింగ్ 2లో



నేడు కడపలో
రాహుల్ గాంధీ బహిరంగ సభ

ప్రజాశక్తి - కడప/వేంపల్లె

ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కాంగ్రెస్ పార్టీ మాజీ జాతీయ అధ్యక్షులు, ఎంపీ రాహుల్ గాంధీ కడపలో పర్య టించనున్నారు. ఉదయం 11:30 గంటలకు కడప విమానాశ్రయం చేరుకుం టారు. అక్కడి నుంచి ఉదయం 11:45 గంటలకు హెలికాప్టర్‌లో పిసిసి అధ్యక్షులు షర్మిలతో కలసి ఇడుపులపాయకు బయలు దేరుతారు. మధ్యాహ్నం 12 గంటలకు వైఎస్ఆర్ ఘాట్‌కు చేరుకుని రాజశేఖర్‌రెడ్డి సమాధికి పూలమాలవేసి నివాళులర్పిస్తారు. అనంతరం 12:25 గంటలకు తిరిగి హెలి కాప్టర్‌లో బయలుదేరి 12:40 గంటలకు కడప విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్ షోగా బయలుదేరి బిల్డప్ వద్దగల పుత్త ఎస్టేట్ ఆవరణలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1:00 గంట నుండి 1:45 గంటల వరకు ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు రాహుల్ గాంధీ కడప విమానాశ్రయం చేరుకొని అక్కడి నుంచి 2:15 గంటలకు బయలుదేరి వెళ్తారు.

గెలుపుపై..ఎవరి ధీమా వారిదే..

4,5లో

నేటితో ప్రచారానికి..

(మొదటిపేజీ తరువాయి) పోలరైజేషన్‌పై దృష్టి సారించాల్సి ఉంది.ఇందులోభాగం గానే శుక్రవారం సాయంత్రం కడపలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రోడ్‌షో, శనివారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కడప మున్సిపల్ మైదానంలో ఎన్నికల ప్రచారానికి హాజరు కానున్నారు. రాహుల్ సభ అనంతరం ఎన్నికల కమిషన్ నిబంధన మేరకు పోలింగ్‌కు 48 గంటల ముందు ఎన్నికల ప్రచారాల్ని నిలిపేయాల్సి ఉంది. ఎన్నికల ప్రచారం ముగిసిన అనంతరం తెరవెనుక అసలైన రాజకీయం నడవనుంది. ప్రలోభాలు, బుజ్జగింపులు, బెదిరింపులు మొదలగు కార్యకలాపాలకు తెరపైకి రానున్న సంగతి తెలిసిందే. జిల్లా అధికార యంత్రాంగం పోలింగ్ నిర్వహణకు ఎన్నికల సామగ్రి, సిబ్బంది, పర్యవేక్షణ, బందోబస్తు వంటి పాలనాపరమైన చర్యలు తీసుకునే పనుల్లో నిమగ్నం కావడం గమనార్హం. పోలింగ్ అనంతరం జూన్ నాలుగున కౌంటింగ్ ప్రక్రియతో ఎన్నికల క్రతువు ముగియనుంది.

నోట్లతో ఓట్లకు ఎర

జిల్లా వ్యాప్తంగా బరిలో ఉన్న ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ఓటర్లకు నోట్లతో ఎర చూపుతున్నారు. ఇప్పటికే కొందరు అభ్యర్థులు తమ అనుచ రులతో ఇంటింటి ప్రచారం చేయిస్తూ పోలింగ్ స్లిప్పులతో పాటు నోట్లు కూడా పంచుతున్నట్లు తెలిసింది. పోలీసు తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ యథేశ్చగా పంపిణీ కొనసాగిస్తున్నారని తెలిసింది. ఏ మాత్రం బయపడకుండా పెద్ద ఎత్తున సొమ్మును పంచడంలో అభ్యర్థులు పోటీలు పడుతున్నారు. ఓటుకు వెయ్యి నుంచి రూ.2, రూ.3 వేల వరకు పంచుతున్నారు. పోలింగ్ ముందు రోజు అయితే ఎక్కువగా పోలీసులు మోహరించి ఉంటారనే కారణంగా ముందుగానే ఓటర్లను అభ్యర్థులు ప్రస న్నం చేసుకుంటున్నారు. చీటీల రూపంలో నగదు బదిలీ చేస్తున్నారు.

పేదల భవిష్యత్తు కోసం..

(మొదటిపేజీ తరువాయి) అండగా ఉంటానని చెప్పారు. ఫీజురియింబర్స్‌మెంట్‌తోపాటు విద్యా వసతి, విద్యాదీవెన సదుపా యాల్ని కల్పించానన్నారు. అంతర్జాతీయ యూనివర్శిటీలతో ఆన్‌లైన్ కోర్సుల సదుపాయాల్ని కల్పించామని తెలిపారు. రాష్ట్రంలో 31 లక్షల ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్, 22 లక్షల ఇళ్ల నిర్మాణాలను మహిళల పేరిట ఇచ్చామన్నారు. రైతుభరోసా, ఉచిత పంటల బీమా, తొమ్మిది గంటల విద్యుత్, ఆర్బీకేలను ఏర్పాటు చేశామని తెలిపారు. వాహన మిత్ర, నేతన్ననేస్తం, మత్స్యకార భరోసా, నాయీలకు, చేయూత, లానేస్తంతో పాటు ఇతర స్వయంఉపాధి రంగాలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. రూ.25 లక్షలతో కూడిన ఆరోగ్యశ్రీ, ఆరోగ్యఆసరా, విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీడాక్టర్, ఇంటింటికీ వెళ్లి టెస్టులు చేస్తున్న ఆరోగ్య సురక్ష వంటి పథకాలను అమలు చేశామని పేర్కొన్నారు. ఇన్నిన్ని పథకాలను తెచ్చిన ప్రభుత్వాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. లంచాలు, వివక్ష లేని పాలన అందించానని తెలిపారు. రూ.2.70 లక్షల కోట్లను అర్హులైన పేదల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. మీకోసం 130 సార్లు బటన్ నొక్కానని, మీ భవిష్యత్ కోసం రెండు బటనులు నొక్కాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. సంక్షేమ పథకాల్నీ మీఇంటికి చేరా లంటే ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్‌బి అంజద్‌బాషా, పార్లమెంట్ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి శాసన మండలి ఉపాధ్యక్షులు జకియా ఖానం పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోండి

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఈనెల 13న నిర్వహించబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు పోలింగ్ బూత్ వద్దకు చేరుకొని ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికలకు 48గంటలకు ముందు 34 యాక్ట్, 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎటువంటి అవాంఛనీయ సంఘటనకు పాల్పడిన ఉపేక్షించేది లేదని ఎన్నికల స్పెషల్ ఆఫీసర్, కడప డిఎస్‌పి రమాకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో సిఐ పురుషోత్తం రాజుతో కలిసి పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు పోలింగ్ బూత్‌లోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లరాదని పేర్కొన్నారు. ఇవిఎంలను వీడియోలు తీసినా, ఫొటోలు తీసినా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఓటు వేసిన వెంటనే తమ ఇళ్లకు చేరుకోవాలని సూచించారు గుంపుల గుంపులుగా చర్చించుకోవడం చట్ట విరుద్ధమని ఆయన అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నం చేసినా, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా అట్టి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎన్నికలు ముగిసే వరకు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక పోలీసుల నిఘా ఉంటుందని ఆయన అన్నారు. సమావేశంలో స్థానిక ఎస్ఐ మధుసూదన్‌రావు, సిద్దవటం ఎస్ఐ పెద్ద ఓబన్న, స్థానిక పోలీసులు స్పెషల్ పార్టీ సిఆర్‌పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

పిల్లల మానసిక ఉల్లాసానికే వేసవి శిక్షణ

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థికి బహుమతి ప్రదానం చేస్తున్న డిఇఒ అనురాధ

పిల్లల మనో ఉల్లాసానికి వేసవి శిక్షణలు ఉపయోగపడతాయని డిఇఒ అనురాధ పేర్కొన్నారు. శుక్రవారం కడప బాలోత్సవం ఆధ్వర్యంలో బాలబాలికలకు నిర్వహించిన చిత్రలేఖనం, అభ్యుదయ గీతాల శిక్షణ ముగింపు కార్యక్రమం మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ వేసవి శిబిరం ద్వారా విద్యార్థుల్లో ఆసక్తులను గుర్తించి తగిన శిక్షణ ఇస్తే రాణిస్తారని తెలిపారు. డాక్టర్ ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలు సెల్ ఫోన్, జంక్ ఫుడ్ దూరంగా ఉండాలన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే అనుకున్న లక్ష్యం చేరుకోవచ్చన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కడప బాలోత్సవం నిర్వాహకులు నాగముని రెడ్డి, గోపాల్, రాజశేఖర్ రాహుల్, లక్ష్మిరాజ, విజయకుమార్, మహేష్, అరుణ ,కామేశ్వరమ్మ , సరస్వతి, వెంకటేశ్వర్లు, సమీర్ బాష, మామిడి బాబు, రంగనాయకులు, సుందరయ్య, మధుసూధన్, కిరణ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మోటార్లకు మరమ్మతులు చేయాలి : కమిషనర్

అధికారులకు సూచనలు ఇస్తున్న కమిషనర్

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో అభివృద్ధి పనులను కమిషనర్ జి. సూర్య సాయి ప్రవీణ్ చంద్ మార్నింగ్ విజిట్ లో భాగంగా లింగంపల్లి, బండి కనుమ డౌన్ పంప్ హౌస్ గండి వాటర్ వర్క్స్, పాత కడప ఇంటర్ కనెక్షన్స్, పాత మున్సిపల్ ఆఫీస్‌లను ఇంజనీరింగ్ విభాగ అధికారులతో కలసి పరిశీలించారు. లింగంపల్లి పంప్ హౌస్‌లో కమిషనర్ కడప ప్రజల కు నీటి సరఫరా సమృద్ధి ఏర్పాటు చేయడానికి లింగంపల్లి వాటర్ పంప్ హౌస్ పరిశీలించారు. కలెక్షన్ వెల్స్ రిజిస్టర్ లను పరిశీలించారు. లింగంపల్లి పంప్ హౌస్ వద్ద మోటర్స్ ఎలక్ట్రికల్ కేబుల్స్ బయటికి కనబడకుండా పివిసి పైపులు ఏర్పాటు చేయాలని సూచించారు.స్టాక్, సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. లింగంపల్లి పంప్‌హౌస్ 1,2లో ఉన్నటువంటి వేస్ట్ మెటీరియల్ ఎంఆర్ఎఫ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు తరలించాలని సూచించారు. జూన్ నుంచి లింగంపల్లిలో పండ్లు, ఇతర మొక్కలు ఏర్పాటు చేయడానికి తగు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బండి కనుమ డౌన్ పంప్ హౌస్ కలెక్షన్ వెల్స్ పరిశీలించారు. పంప్ హౌస్ వద్ద 900 డిఐ పైప్‌లైన్ ఏర్పాటుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు. అటెండెన్స్ రిజిస్టర్లు ఏర్పాటు చేసుకోవాలని ఇంజినీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు. పంపు హౌస్ లో 100 హెచ్‌పి మోటార్స్ వెంటనే మరమ్మతులు చేయించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లింగంపల్లి హెడ్ వాటర్ వర్క్స్ వద్ద మోటార్స్, ఇంఫిల్ట్రేషన్ ట్యాంక్స్ నీటి నిల్వ సమర్థుల వివరాలను వాల్స్ పై పెయింటింగ్ వేయాలని సూచించారు. పంప్ హౌస్‌లో ఉన్నటువంటి మోటార్స్ వివరాలను ఫోమ్ బోర్డులో నమోదు చేసి గోడలపై అంటించాలని ఆదేశించారు. లింగంపల్లి హెడ్ వాటర్ వర్క్స్ వద్ద 'పెన్నా పంప్ హౌస్' పేరుతో

విశ్వవిద్యాలయ ప్రగతే లక్ష్యం : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న విసి సుధాకర్

అందరి సహకారంతో రానున్న రెండేళ్లలో వైవీయూను అభివృద్ధి పథంలో తీసుకువెళతానని విసి ఆచార్య చింత సుధాకర్ అన్నారు. విసిగా ఏడాదిపాలన పూర్తయిన సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథ్ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎం.ఈశ్వర్ రెడ్డి, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ ఏజీ దాము, అధ్యాపకులు, బోధ నేతర సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఏడాది కాలంలో విసి ఆచార్య సుధాకర్ సారథ్యంలో పరిపాలన, బోధన, పరిశోధనల పరంగా ప్రగతిని రిజిస్ట్రార్ వివరించారు. ఆచార్య చింతా సుధాకర్ స్పందించి మాట్లాడుతూ విశ్వవిద్యాలయం అభివృద్ధి చెందడానికి అన్ని వనరులు, నైపుణ్యత గల అధ్యాపకులు బోధ నేతర సిబ్బంది ఉన్నారని తద్వారా వైవీయూ ప్రగతి పథంలో వెళుతుందన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ శాఖ సిబ్బంది, బోధ నేతర సిబ్బంది ప్రత్యేకంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు, అకడమిక్ కన్సల్టెంట్లు, ఇంజనీర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ ఎంపికలకు విశేష స్పందన

ప్రజాశక్తి - కడప

కడపలోని వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో శుక్రవారం ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన ఎపిఎల్-2024 సీజన్ -3 క్రికెట్ ఎంపికలకు విశేష స్పందన లభించింది. ఎసిఎ సౌత్ జోన్ కన్వీనర్ ఎ. రెడ్డి ప్రసాద్ ప్రారంభించారు. కడప, నెల్లూరు, చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి దాదాపు 140 మంది క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎసిఎ జోన్ అసిస్టెంట్ డెవలప్మెంట్ మేనేజర్ ఎస్. కాజా మైనుద్దీన్, ఎపిఎల్ సెలెక్టర్లు, జిల్లా కోచ్ ు పాల్గొన్నారు. ఓపెన్ సెలక్షన్స్‌లో మంచి ప్రతిభ కనపరిచి ఏపిఎల్ 2024 సీజన్ -3 మ్యాచ్‌లకు ఎంపికైన క్రీడాకారుల పేర్లను త్వరలో వారి మెయిల్ ఐడికి పంపుతామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఎంపికల్లో పాల్గొన్న 5 జిల్లాలకు చెందిన క్రికెటరు

నియామక పత్రాన్ని అందుకుంటున్న రాజా

తెలుగు యువత జిల్లా కార్యదర్శిగా రాజా

ప్రజాశక్తి- కడప అర్బన్

తెలుగు యువత జిల్లా కార్యదర్శిగా రాజాను నియమిస్తూ జిల్లా అధ్యక్షులు ఆర్. శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం నియామక పత్రాన్ని రాజకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ గెలుపు కోసం యువత శక్తి వంచన లేకుండా పని చేయాలని పిలుపునిచ్చారు. ఓటుపై అవగాహన కల్పించి ఓటింగ్‌లో పాల్గొనేలా చూడాలని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు చంద్రబాబు నాయుడు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఎన్నికల్లో టిడిపి కూటమిని అధికారంలోనికి తెచ్చి చంద్రబాబు నాయుడును సిఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎద్దుల శంకర్ పాల్గొన్నారు.

దళితుల ద్రోహి సిఎం జగన్

ప్రజాశక్తి - కడప అర్బన్

దళితులకు ద్రోహం చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ విమర్శించారు. శుక్రవారం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగలకు సామాజిక న్యాయం చంద్రబాబు చేశారని తెలిపారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమిని మాదిగల గెలిపించాలని పిలుపునిచ్చారు. నియంతృత్వ పాలనలో ఉన్నామని పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డిని ఓడించకపోతే మాదిగలకు భవిష్యత్తు ఉండదని హెచ్చరించారు. కోటి మందికి పైగా ఉన్న దళితులు నష్టపోయారని చెప్పారు. ప్రజా పాలనను జగన్ అనిచివేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 50 లక్షల పైగా మాదిగల ఉన్నారని చెప్పారు. డప్పు కళాకారుల చర్మకారులకు పెన్షన్ ప్రవేశపెట్టింది టిడిపి ప్రభుత్వమే అన్నారు. ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సుబ్బారావు మాదిగ, వనం నాగేశ్వరరావు, మునయ్య మాదిగ, గురవయ్య, భాస్కర్, సంజీవ్, రమణ, సుబ్బయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

ఓటును దుర్వినియోగం చేయొద్దు

ప్రజాశక్తి - కడప

కడప నగరం బిల్టప్ సమీపంలోని 48 డివిజన్ కృపా కాలనీలో న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరూ శాంతి యుతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని శుక్రవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ పి.మహేష్ మాట్లాడుతూ ప్రతి పౌరుడూ విలువైన ఓటును దుర్వినియోగం చేసుకోకుండా, మంచి నాయకునికి ఓటు వేసి ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వాసులు పి.రవితేజ, శాంతిరాజు, ఎ..రవి, అగస్టిన్, రోజా, లీలావతి, గోకారి, వెంకటేష్, అశోక్,సుగుణమ్మ, సరళ, ప్రజలు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా : వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

వెంకటముని (ఫైల్ ఫొటో)

ట్రాక్టర్ బోల్తా పడి ఓ వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటన గురువారం రాత్రి నిమ్మనపల్లె మండలంలో జరిగింది. మృతుడి బంధువులు, పోలీసుల వివరాల మేరకు.. చౌడేపల్లె మండలం పంచాయతీ పొదలపల్లెకు చెందిన చిన్నప్ప కుమారుడు వి.వెంకటముని (47), గురువారం సాయంత్రం తన సొంత ట్రాక్టర్‌లో వరిగడ్డి లోడుతో నిమ్మనపల్లె మీదుగా వాల్మీకిపురం మండలం చింతపర్తిలో ఉన్న మరదలు జి.లక్ష్మీదేవి ఇంటికి వెళ్లి గడ్డి దింపివేసి రాత్రి తిరుగు పయనం అయ్యారని తెఇలపారు. ట్రాక్టర్ వేగంగా వస్తుండగా మార్గ మధ్యమంలోని అగ్రహారం పంచాయతీ చింతపర్తివారిపల్లె వద్ద ఉన్న మలుపులో, వేగాన్ని నియంత్రించలేక ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిందని తెలిపారు. ట్రాక్టర్ నడు పుతున్న వెంకటముని ట్రాక్టర్ కింద పడడంతో అక్కడకక్కడే దుర్మరణం పాలయ్యారని అన్నారు. గమనించిన స్థానికులు నిమ్మనపల్లె పోలీసులకు సమాచారం అందించడంతో, సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మద నపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుని భార్య వసంతపల్లి పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ డి.రమేష్‌బాబు తెలిపారు. మృతునికి భార్య పార్వతి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

నత్తనడకన ఓటర్ కూపన్లు పంపిణీ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీ పరిధిలో ఓటర్ కూపన్ల పంపిణీ నత్తనడకన సాగుతోంది. పట్టణంలో చాలావరకు కూపన్ల పంపిణీ చేయడంలో వెనకబడడమే కాకుండా, హోం ఓట్ల విషయంలో కూడా సచి వాలయం సిబ్బంది చాలా నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తున్నారని ఓటర్లు ఆవేదన చెందు తుంద న్నారు. నగర పంచాయతీ పరి ధిలో 30 వేల జనాభాలో 22 మందిని మాత్రమే హోం ఓట్లుగా గుర్తించడం, చాలా వరకు వృద్ధులు పోలింగ్ బూత్ వరకు వచ్చి ఓటు వేయలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా బిఎల్‌ఒలు, సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని ఓటర్లకు ఓటర్ కూపన్లు అందజేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

IN THE COURT OF THE HON'BLE III ADDITIONAL DISTRICT JUDGE:: KADAPA
O.S.NO. 1200/2019

Masiga Sudha, Wife of Masiga Reddaiah, Hindu, aged about 52 years, Housewife, Residing at Annaluru Village, Mydukur Mandal, Kadapa Dist., ...**Plaintiff**

Vs

1. Shaik Darbar Bee, Wife of Shaik Anwar Basha, aged about 51 years, Muslim, Housewife,residing at D.No.8/137, Ravindra Nagar, Kadapa City and District.
2. Shaik Mahaboob Basha, S/o Shaik Mahaboob Basha, aged 52 years, Muslim, Business, residing at D.No.8/137, Ravindra Nagar, Kadapa City and District.

...**Defendants**

Notice to Defendants 1 & 2

ఇందుమూలముగా ప్రతివాదులు అయిన మీకు పై దావాలో తెలిపిన వాది తెలియజేయడం ఏమనగా మీమీద పై దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావా మీ నోటీసుకు గాను 15.05.2024వ తేదీన వాయిదా వున్నది. కావున మీరు 15.05.2024వ తేదీన ఉదయం 10:30 గంటలకు పైన తెలిపిన కోర్టు నందు స్వయముగా గానీ లేక వకీలు ద్వారా గానీ హాజరై ఎటువంటి ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో రాజశ్రీ కోర్టువారు మీపై పరోక్షముగా తీర్మానించబడును.

// BY ORDER OF THE COURT//
S.NAGI REDDY
Advocate for D.Hr.
Kadapa City

జోరుగా ప్రచార హోరు

ఎన్నికల ప్రచారంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు

సంక్షేమ పాలన వైసిపితోనే సాధ్యం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

సంక్షేమ పాలన కోసం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు.శుక్రవారం నగర పంచాయతీ పరిధిలోని శెట్టిపల్లి, ఇంద్రమ్మకాలనీ, చంద్రమాకులపల్లిలో పార్టీ శ్రేణులతో కలిసి ముమ్మర ఎన్నికలు ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ తన సుదీర్ఘ ప్రజాసంకల్ప యాత్రలో నిరుపేదల కష్టాలను ప్రత్యక్షంగా తిలకించి,అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్నాలు అనే సంక్షేమ పథకాలు తీసుకొచ్చి ప్రజల కష్టాలను తీర్చి వారి జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ వ్యవస్థలను తీసుకువచ్చి సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు అందించారని తెలిపారు. సంక్షేమ పథకాలు యధావిధిగా కొనసాగాలంటే మరోసారి వైసిపిని ఆదరించాలని కోరారు.తెలుగుదేశం పార్టీ బూటకపు హామీలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మాలిక్, సచివాలయ కన్వీనర్లు శెట్టిపల్లి రమేష్ రెడ్డి,కంచి కళ్యాణ్ కుమార్ రెడ్డి,జె.ఎన్.పి శ్రీనివాసులు, నక్క సంతోష్, ఎస్ ఎస్ ఫయాజ్,పాకాల అంజమ్మ, మాజీ సర్పంచి నాగరాజు, వైసీపీ జిల్లా ప్రచార కార్యదర్శి అయుబ్ బాషా, కో-ఆప్షన్‌మెంబర్ నాసర్, పోకనాటివీధి యూత్, వైసిపి నాయకులు, కంచి సురేందర్‌రెడ్డి, నరసింహనాయుడు, జయ చంద్ర, తిరుమల కమలాకర్, సద్దాం, టి.జనార్ధన్ మహమ్మద్ సాదిక్, పూలశాంతమ్మ, సావిత్రమ్మ పాల్గొన్నారు.

ఇవిఎం నమూనాతో అవగాహన కల్పిస్తున్న వైసిపి నాయకులు

మరొకసారి ఆశీర్వదించండి

నిమ్మనపల్లె : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు ఓటు వేసి మరోసారి ఆశీర్వదించాలని వైసిపి మండల కన్వీనర్ సదాశివరెడ్డి అన్నారు. మండల వ్యాప్తంగా స్థానిక సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కో-ఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు వారి వారి పంచాయితీలలో ప్రచారాన్ని నిర్వహించి ఓటింగ్ సరళి పై ఓటర్లకు అవగాహన కల్పించారు. వైసిపి విజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మండల కన్వీనర్ సదాశివరెడ్డి పాల్గొన్నారు. ప్రజలు అడగకుండానే సంక్షేమ పథకాల ద్వారా వారి అవసరాలను తీర్చుతూ జీవితాలను బాగుపడిచిన జగనన్నకు తోడుగా నిలవాలని పిలుపునిచ్చారు. రైతులకు రైతు భరోసా పథకాన్ని అందిస్తూ, సకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీలను అందించారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరి ఇంటిలోనూ జగనన్న ప్రభుత్వంలో మంచి జరిగిందని అన్నారు. ఇవిఎం నమూనాలను చూపుతూ ఓటింగ్ సరళిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిపి నరసింహులు, సర్పంచులు సుబ్రమణ్యం (మధు), రెడ్డమ్మ చంద్రాయుడు, శ్రీవాణి నవీన్, మహాదేవ రెడ్డి, ఉషారాణి, మండల కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్‌రఫీ పాల్గొన్నారు. **రాజంపేటఅర్బన్ :** రాష్ట్ర అభివృద్ధికి వైసిపికి మరోసారి అవకాశం కల్పించాలని వైసిపి అసెంబ్లీ అభ్యర్థి ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండల పరిధిలోని వరదయ్యగారిపల్లి గ్రామపంచాయతీలోని వడ్డిపల్లి, వరదయ్యగారిపల్లి, వెంక టంపల్లి దళితవాడ, అరుంధతివాడ తదితర గ్రామాలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆకేపాటిని గజమాల, శాలువాతో ఘనంగా సన్మానించి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ కుల, మత, ప్రాంతాలకు, పార్టీలకతీతంగా అన్ని వర్గాల వారికి సమాన పాలనదిస్తున్న ముఖ్యమంత్రి జగన్మో హన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేయాలని అన్నారు.13న జరిగే ఎన్నికల్లో తనను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వరదయ్యగారిపల్లి ఎంపిటిసి నాగార్జుననాయుడు, రోశయ్య నాయుడు, సోమయ్యనాయుడు, నరసింహులు, వైసిపి నాయకులు బొల్లినేని రామ్మోహన్ నాయుడు, దాసరి పెంచల య్య, కోటి, అత్తిరాల శివయ్య పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి గెలుపు అభివృద్ధికి మలుపు

ప్రజాశక్తి -రామసముద్రం

మండలంలోని ఎలకపల్లి, నారిగానిపల్లి పంచాయతీలలో మాజీ ఎంపిటిసి నరసింహులు, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో టిడిపి గెలుపుకోసం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి కంచుకోటకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్క కార్యకర్త ముందుండి టిడిపి గెలుపునకు కృషి చేయాలని కోరారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన బాషాను అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కొనంగి కృష్ణ, కనంపల్లి చలపతి, కదిరప్ప, శ్రీనివాసులు, శ్రీరాములు, అరవింద్, బూడిద గంగాధర్, కె.చలపతి, ఎలకపల్లి, సుబ్బన్న, వెంకటేష్, అప్పయ్య, ఎస్.రెడ్డెప్ప పాల్గొన్నారు.

ప్రసాద్‌బాబుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి

వీరబల్లి: వైసిపి పాలనతో కునారిల్లిన వ్యవస్థను చక్కదిద్ది, రైతు, ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి పాటు పడడం చంద్రబాబుతోనే సాధ్యమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ శాఖ కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు పేర్కొన్నారు. మండలంలోని ఓదివీడు పంచాయతీలో కుమ్మరపల్లి, రామాపురం, ఎర్రం రాజుగారిపల్లి, మాదిగపల్లి, ఓడివీడు కస్బా గ్రామాల్లో టిడిపి నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి సుగువాసి బాలసుబ్రమణ్యంను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో వెంట సారథిరాజు, ఎల్.జి. రమేష్, సాయికుమార్, భాస్కర్‌రాజు, రామాంజనేయులు, దుర్గం ఆంజనేయులు, రవిరాజు, తెదేపా నాయకులు, కార్యకర్తలు ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

యువత భవిష్యత్తు కోసం జగన్ సిఎం కావాలి

తంబళ్లపల్లి : ఆంధ్ర రాష్ట్రంలో భావితరాల భవిష్యత్తు కోసం మళ్ళీ జగనను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని వైసిపి మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి సర్పంచ్ జ్యోతి కోరారు. శుక్రవారం మర్రిమాకులపల్లి పంచాయతీలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి అందిన సంక్షేమ పథకాలు మండలం గ్రామంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తూ ఆయన ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. చరిత్రలో ఊహించని విధంగా తంబళ్లపల్లి నియోజకవర్గంలో అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించిన ఘనత పెద్దిరెడ్డి కుటుంబానిదేనని అన్నారు. జరగనున్న ఎన్నికలలో రాజంపేట పార్లమెంటు అభ్యర్థిగా మిథున్ రెడ్డికి, ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డిలను గెలిపించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఆమె వెంట మల్లప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు. జుంజర పెంటల్లో ముమ్మర ప్రచారం మండలంలోని జుంజర పెంటల గ్రామపంచాయతీ లో సర్పంచ్ భూదేవి ఆధ్వర్యంలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం సాగించారు. ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరి స్తూ మరో మారు వైసిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చెగల్‌రాయుడు, వైవి రమణారెడ్డి పాల్గొన్నారు.

మేనిఫెస్టో చూపుతున్న షాజహాన్‌బాషా, మైనార్టీ నాయకులు

ముస్లిముల సంక్షేమమే టిడిపి కర్తవ్యం

ప్రజాశక్తి-మదనపల్లి

ముస్లిముల సంక్షేమం అభివృద్ధి కర్తవ్యంగా టిడిపి తమ ఎన్నికల మేనిఫెస్టోలో వెల్లడించిందని ఇది ప్రభుత్వంలో అధికారంలోకి రాగానే ముస్లిములకు అందించడం జరుగుతుందని మదనపల్లి అసెంబ్లీ టిడిపి అభ్యర్థి ఎం.షాజహాన్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ముస్లిం పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. విజయవాడలో హజ్‌హౌస్ నిర్మాణం, వడ్డీ లేని ఐదు లక్షల రూపాయల రుణం, విదేశీ విద్యా పథకం, దుల్హాన్ పథకం, హజ్ యాత్రకు వెళ్లే ప్రతి ముస్లిము కు ఆర్థిక సహాయం, 50 సంవత్సరాలకే పింఛన్ పథకం, లతో పాటు నాలుగు శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని అన్నారు. ఈ సమావేశంలో ముస్లిం మత పెద్దలు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'తో పేదలకు లబ్ధి

ప్రజాశక్తి-ములకలచెరువు

టిడిపి అభ్యర్థి జయచంద్రారెడ్డి గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తంబళ్లపల్లె జనసేన నియోజకవర్గ ఇంచార్జీ పోతుల సాయినాథ్ పేర్కొన్నారు. శుక్రవారం పిటిఎం మండలం, మద్దయ్యగారిపల్లి పంచాయతీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సూపర్-6 పథకాల కరపత్రాలు, మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో పేదలకు మేలు జరుగుతుందని అన్నారు.వైసిపి అరాచక పాలన సాగనంపేందుకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలన్నారు.

మహిళా సాధికారత టిడిపితోనే సాధ్యం

రామాపురం : మహిళా సాధికారత టిడిపితోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్దిలేవుల రమేష్‌రెడ్డిలతో కలిసి నల్లగుట్టపల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని, రాజంపేట ఎంపీ అభ్యర్థి కిరణ్ కుమార్‌రెడ్డిలను గెలిపించాలని కోరారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి కూలీలకు వద్దకు వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వారికి వివరించారు. కార్యక్రమంలో మండల మైనార్టీ నాయకుడు ఎస్ మహబూబ్‌బాషా, రమణయాదవ్, అన్నయ, ధనుంజయ కదిరప్ప నాయుడు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ద్వారకనాథ్‌రెడ్డి

కప్పదాట్లు

కాంగ్రెస్‌లో చేరిన వారితో అఫ్జల్‌ఖాన్

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

ప్రజాశక్తి-కడప

కడప నగరంలోని మారుతి నగర్‌లోని అఫ్జల్‌ఖాన్ కార్యాలయంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కడప నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అఫ్జల్ ఖాన్ సమక్షంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ తాహిర్‌అలీ, షైక్ జిలాని బాషా, వారి మిత్ర బృందం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ నెల 13న నిర్వహించే ఎన్నికల్లో కడప ఎమ్మెల్యేగా అఫ్జల్ ఖాన్ అయిన తనను, ఎంపీగా వైఎస్ షర్మిల ను అత్యధిక మెజారిటితో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కడప ప్రజలు, మైనారిటీ సోదరులు పాల్గొన్నారు.

టిడిపి నుంచి వైసిపిలోకి 80 కుటుంబాలు

చెన్నూరు: పుణ్యభూమి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వైసిపి నాయకులు, కాశీభట్ల సత్య సాయి నాధ శర్మ ఆధ్వర్యంలో 80 కుటుంబాలు టిడిపిని వీడి శుక్రవారం వైసిపిలో చేరాయి. మండలంలోని షుగర్ ఫ్యాక్టరీలో సాయి నాధ శర్మ ముఖ్య అనుచరుడు తుపాకుల జనార్దన్‌రెడ్డి తో పాటు ఆయన ఆత్మీయులు వార్డు మెంబర్ కుమార్‌తో సహా 35 కుటుంబాలు, అలాగే ఎస్టీ కాలనీలో 25 కుటుంబాలు టిడిపిని వీడి వైసిపిలో చేరాయి. వీరందరికీ సాయినాధ శర్మ వైఎస్ఆర్సిపి కండువాలు కప్పి పార్టీల్లోకి ఆహ్వానించారు. చెన్నూరు అరుంధతి నగర్‌లో 20 దళిత కుటుంబాలూ వైసిపిలో చేరాయి. కార్యక్రమంలో వైఇసపి మండల కన్వీనర్ జి.ఎన్. భాస్కర్‌రెడ్డి, ఎంపిటిసి రఘురాంరెడ్డి, మాజీ ఎంపిటిసి భాస్కర్‌రెడ్డి, పెద్ద బుద్ధి వెంకట శివప్రసాద్, బ్రహ్మయ్య, కరుణాకర్, వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మరో 45 కుటుంబాలు..

మండలంలోని కొండపేట గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ గుడిపాటి రాజేష్‌తో పాటు ఎస్‌సి కాలనీకి చెందిన 15 కుటుంబాలు శుక్రవారం టిడిపిని వీడి వైసిపిలో చేరాయి మీరందరికి ఎమ్మెల్యే పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి పార్టీ కండువా వేసి పార్టీలోనికి సాధారంగా ఆహ్వానించారు, ా చెన్నూరు తూర్పుగోదావరి జిల్లా వాడకు చెందిన 30 కుటుంబాలు టిడిపిని వీడి ఎమ్మెల్యే పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరాయి.

టిడిపిలోకి 20 కుటుంబాలు..

కలసపాడు : మండలంలోని దమ్మనపల్లె, ఈదులపల్లి గ్రామాలకు చెందిన సుమారు 25 కుటుంబాల వారు సర్పంచి ఎనుముల సుధాకర్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని పార్టీలో చేరుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు సీతా వెంకటసుబ్బయ్య, బ్రహ్మయ్య బాలయ్య నారాయణ, రమణయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం ఆశీర్వదించండి : 'గడికోట'

ప్రజాశక్తి-రాయచోటి

ముస్లిములతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించి మరో అవకాశం ఇస్తే జిల్లా కేంద్రం రాయచోటిని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని బంగ్లా, ఠాణా సమీపాలలోని మసీదులలో ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డిని కలిసిన మైనారిటీలతో ఆయన మాట్లాడుతూ తనకు మరో అవకాశం కల్పిస్తే పట్టణాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని కోరారు. ప్రజలకు మరింత సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందాలంటే మరోమారు జగన్‌ను సిఎం చేయాలని అభ్యర్థించారు. ఉర్దూను రెండో అధికార భాషగా గుర్తించారని, ప్రభుత్వ, నామినేటెడ్ పదవుల్లో ఊహించని విధంగా మైనార్టీలకు అగ్రతాంబూలం ఇచ్చారన్నారు. పట్టణంలో వందపడకల ఆసుపత్రి, ఆర్‌టిసి బస్టాండ్ విస్తరణ, మున్సిపల్ సభాభవనం, ఎంపిడిఒ కార్యాలయం, రైతు బజార్, నగర వనం, స్టేడియం, శిల్పారామం, టిటిడి కల్యాణ మండపం, ఈద్గా, షాదీ ఖానాల అభివృద్ధి, ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌తో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, మదనపల్లె పరిశీ లకులు హాబీబుల్లా ఖాన్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారిమహమ్మద్ ఖాన్, కౌన్సిలర్లు గౌస్ ఖాన్, ఫయాజ్ అహమ్మద్, ఎస్‌పిఎస్ రిజ్వాన్, సాదిక్‌అలీ, అన్నా సలీం, రియాజ్,పార్టీ పట్టణ అధ్యక్షుడు రియాజుర్ రెహ మాన్, పట్టణ జె సి ఎస్ కన్వీనర్ నవరంగ్ నిస్సార్, మాజీ కో–ఆప్షన్ జాఫర్ అలీ ఖాన్, సకీర్, అజ్మతుల్లా ఖాన్ పాల్గొన్నారు.

గెలుపుపై.. ఎవరి ధీమా వారిదే..

- కడప లోక్‌సభ బరిలో యువత
- సర్వశక్తులు ఒడ్డుతున్న అభ్యర్థులు
- రికార్డు సృష్టించేందుకు షర్మిల, అవినాష్ తహతహ
- పాగాకు భూపేష్ ఆరాటం

ప్రతి ఎన్నికల్లోనూ రెండు పార్టీలకు మధ్యే పోరు. ఈ సారి త్రిముఖ పోరు నెలకొంది. యువకులు రంగంలోకి దిగడంతో కడప లోక్‌సభ స్థానం పరిధిలో రాజకీయ సమీకరణాలు అత్యంత ఆసక్తికరంగా మారాయి. వైసిపి, తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల నుంచి సమఉజ్జీలైన యువ నేతలు బరిలో దిగడంతో త్రికోణ పోరు నెలకొంది. గెలుపుపై మాత్రం ఎవరి ధీమాలో వారు ఉన్నారు. కడప లోక్‌సభ స్థానం ఎన్నికలు మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. మూడు ప్రధాన పార్టీలకు జీవన్మరణ సమస్యగా మారింది. గెలుపే లక్ష్యంగా వైసిపి అభ్యర్థి వై.ఎస్.అవినాష్‌రెడ్డి, తెలుగుదేశం అభ్యర్థి చదిపిరాళ్ల భూపేష్‌సుబ్బరామిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి వైఎస్.షర్మిల వ్యూహ ప్రతి వ్యూహాల్లో మునిగితేలుతున్నారు. కడప లోక్‌సభ ఎన్నికలపైనే అందరి దృష్టి నెలకొంది. ఈ ఎన్నికల్లో నల్లధనం నిర్ణయాత్మకంగా మారింది. అన్నింటికంటే సాంప్రదాయ, సానుభూతి ఓట్లపై కూడా అభ్యర్థులు ఆధారపడుతున్నారు. హోరాహోరీగా సాగే పోరులో వైసిపి, కాంగ్రెస్ పార్టీల మధ్యనే ప్రధానంగా పోటీ నెలకొనే అవకాశాలు ఉన్నాయి. తెలుగుదేశం పార్టీ మాత్రం నామమాత్రంగానే పోటీలో ఉందని చెప్పవచ్చు. ప్రస్తుత పోరులో తెలుగుదేశం మూడో స్థానంలో నిలిచే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

రికార్డు సృష్టించేందుకు షర్మిల, అవినాష్ తహతహ

కడప పార్లమెంట్‌లో విజయం సాధించి రికార్డును నెలకొల్పేందుకు సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్.షర్మిల తహతహలాడుతున్నారు. 1989 నుంచి కడప లోక్‌సభ స్థానాన్ని వైఎస్ కుటుంబం తమ గుప్పిట్లో పెట్టుకుంది. అప్పటి నుంచి ప్రస్తుత ఎన్నికల వరకు 10 సార్లు ఎన్నికలు జరిగాయి. అందులో నాలుగు సార్లు మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి విజయం సాధించగా రెండు మార్లు ఆయన సోదరుడు వైఎస్ వివేకానందరెడ్డి విజయం సాధించారు. రెండు మార్లు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గెలుపొందారు. 2011 ఉప ఎన్నికల్లో జగన్ 5,45,671 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. 2014, 2019లో వైఎస్.అవినాష్‌రెడ్డి గెలుపొందారు. ఈ ఎన్నికల్లో తమదే ఆధిపత్యమని చేప్పేందుకు అవినాష్ చూస్తున్నారు. కడప లోక్‌సభ అభ్యర్థి విజయానికి పులివెందుల శాసనసభ స్థానంలో వచ్చే ఓట్లే కీలకంగా మారుతున్నారు. వరుసగా 10 సార్లు జరిగిన ఎన్నికల్లో వైఎస్ కుటుంబం విజయం సాధించడానికి పులివెందుల్లో వచ్చిన ఓట్లే కీలకం. అక్కడ పోలింగ్ 90 నుంచి 95 శాతం నమోదవుతూ వస్తోంది. గడచిన రెండు దశాబ్దాలకు పైగా కడప లోక్‌సభ స్థానం కాంగ్రెస్ పార్టీ చేతిలోనే ఉండేది. మళ్లీ ఆ స్థానాన్ని నిలబెట్టుకోవాలనే ప్రయత్నాల్లో ఉంది. తొలిసారిగా లోక్‌సభ స్థానం బరిలో నిచిన షర్మిల ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో ఉన్నారు. విజయం కోసం ఆమె అలుపెరగని పోరాటం చేస్తోంది.

పాగాకు భూపేష్ ఆరాటం

35 సంవత్సరాలుగా తెలుగుదేశంకు అందని ద్రాక్షలా ఊరిస్తున్న కడప లోక్‌సభ స్థానం భూపేష్‌సుబ్బరామిరెడ్డి రాకతోనైనా దక్కేనా అంటూ ఆ పార్టీ శ్రేణులు ఆశగా ఎదురుచూస్తున్నారు. పూర్వవైభం సాధించేందుకు ఆరాటపడుతోంది. తెలుగుదేశం ఆవిర్భావం తర్వాత 1984లో మినహా తరువాత ఎప్పుడూ ఆ పార్టీ గెలుపొందలేదు. ఈ ఎన్నికల్లోనైనా కడప స్థానాన్ని కైవసం చేసుకోవాలనే పట్టుదలతో టిడిపి ఉంది. 2011లో జరిగిన ఉప ఎన్నికల్లో టిడిపి తరపున పోటీ చేసిన మైసూరాకు డిపాజిట్ కూడా దక్కలేదు. అవినాష్, షర్మిలకు గట్టిపోటీ ఇవ్వొచ్చు. జమ్మలమడుగు, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు నియోజకవర్గాల్లో భూపేష్‌కు ఆధిక్యత వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా సాంప్రదాయ ఓట్లపైనే టిడిపి ఎక్కువగా దృష్టి సారించింది.

- ప్రజాశక్తి - కడప డెస్క్

1952 నుంచి కడప లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల వివరాలు

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
1952	ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి	సిపిఐ	పి.బసిరెడ్డి	కాంగ్రెస్	18467
1957	వి.ఆర్.రెడ్డి	కాంగ్రెస్	ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి	సిపిఐ	6256
1962	ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి	సిపిఐ	వి.ఆర్.రెడ్డి	కాంగ్రెస్	20867
1967	ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి	సిపిఐ	కె.రామసుబ్బమ్మ	కాంగ్రెస్	37719
1971	ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి	సిపిఐ	వి.ఆర్.రెడ్డి	ఎన్‌సిఒ	93614
1977	కందుల ఓబులరెడ్డి	కాంగ్రెస్	వి.రామిరెడ్డి	బిఎల్‌డి	7562
1980	కందుల ఓబులరెడ్డి	కాంగ్రెస్(ఐ)	పి.వి.ఎస్.మూర్తి	జనతా	50546
1984	డి.ఎన్.రెడ్డి	టిడిపి	కందుల ఓబులరెడ్డి	కాంగ్రెస్	54308
1989	వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి	కాంగ్రెస్	ఎం.వి.రమణారెడ్డి	టిడిపి	166752
1991	వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి	కాంగ్రెస్	సి.రామచంద్రయ్య	టిడిపి	422790
1996	వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి	కాంగ్రెస్	కందుల రాజమోహన్‌రెడ్డి	టిడిపి	5445
1998	వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి	కాంగ్రెస్	కందుల రాజమోహన్‌రెడ్డి	టిడిపి	53881
1999	వై.ఎస్.వివేకానందరెడ్డి	కాంగ్రెస్	కందుల రాజమోహన్‌రెడ్డి	టిడిపి	26597
2004	వై.ఎస్.వివేకానందరెడ్డి	కాంగ్రెస్	ఎం.వి.మైసూరారెడ్డి	టిడిపి	129744
2009	వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి	కాంగ్రెస్	పాలెం శ్రీకాంత్‌రెడ్డి	టిడిపి	178846
2011	వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి	వైసిపి	డిఎల్.రవీంద్రారెడ్డి	కాంగ్రెస్	545671
2014	వై.ఎస్.అవినాష్‌రెడ్డి	వైసిపి	ఆర్.శ్రీనివాసులరెడ్డి	టిడిపి	190323
2019	వైఎస్.అవినాష్‌రెడ్డి	వైసిపి	ఆది నారాయణరెడ్డి	టిడిపి	377153

ప్రశాంత ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం

- జిల్లా ఎన్నికల అధికారి విజయ్‌రామరాజు

ప్రజాశక్తి - కడప

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి విజయ్ రామరాజు తెలిపారు. సైలెంట్ పీరియడ్‌లోనిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చ రించారు. సాధారణ ఎన్నికలు–2024 సైలెన్స్ పీరియడ్‌లో పాటించాల్సిన నిబంధనలపై శుక్రవారం కలెక్టరేట్‌లోని విసి హాలులో ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్, జిల్లా ఎన్నికల కంట్రోల్ రూమ్ ప్రత్యేక పర్యవేక్షకులు జి.ఎస్.ఎస్.ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌లతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 13న పోలింగ్‌కు సంబంధించి సైలెన్స్ పీరియడ్‌లో పాటించాల్సి నిబంధనలపై పలు సూచనలు జారీ చేశారు. న్యాయమైన, నిష్పాక్షికమైన పోలింగ్ నిర్వహించడానికి, అభ్యర్థిని ఎన్నుకునే విషయంలో ఓటర్లపై ఎలాంటి ప్రభావం ఉండకూడదనే ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ 48 గంటల సైలెన్స్ పీరియడ్‌ను అమలు చేస్తుందని ఈనెల 11న సాయంత్రం 6 గంటల నుంచి మే 14న వరకు ఉంటుందని పేర్కొన్నారు. సైలెంట్ పీరియడ్‌లో బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు,ఎలక్ట్రానిక్ మీడియా ప్రచారాలకు అనుమతి లేదు. సోషల్ మీడియా మాధ్యమాల్లో నిబంధనల ఉల్లంఘనపై ప్రత్యేక నిఘా ఉంటుందని చెప్పారు. తెలిపారు. ఐదుగురి కంటే ఎక్కువ మంది వ్యక్తుల సమావేశం లేదా గుమి కూడడం నిషిద్ధమన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రత్యేక భద్రతా సిబ్బంది, సెక్టార్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ పోలింగ్ ప్రక్రియను శాంతియుతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించే ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించేందుకు ఎన్నికల కమిషన్ వారిచే జారీ చేయబడిన మీడియా పాసులు పొందిన అక్రిడేటెడ్ జర్న లిస్టులకు అనుమతి ఉంటుందన్నారు.

సైలెన్స్ పీరియడ్‌లో ఆంక్షలు కఠినతరం: పోలింగ్ నేపథ్యంలో జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా సైలెన్స్ పీరియడ్‌లో ఆంక్షలను కఠినతరం చేస్తామని వి.విజయ్‌రామరాజు రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేశారు. శనివారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో ఎన్నికల సన్నద్ధత, ప్రవర్తనా నియమావళిపై ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్, జిల్లా ఎలెక్షన్ కంట్రోల్ రూమ్ ప్రత్యేక పర్యవేక్షకులు ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్‌తో కలిస గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో భాగంగా శుక్రవారం నాటికి అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పూర్తి చేసి పోలింగ్ నిర్వహణకు సంసిద్ధంగా ఉన్నామన్నారు. జిల్లాలోని మొత్తం 2035 పోలింగ్ స్టేషన్ల వద్ద పోలీసులతో పాటు ఎన్‌సిసి, స్కౌట్ అండ్ గైడ్‌ల సేవలు వినియోగిస్తున్నామని చెప్పారు. ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ మాట్లాడుతూ పోలింగ్ దృష్ట్యా 48 గంటల సైలెన్స్ పీరియడ్‌లో. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని రకాల భద్రతా చర్యలను సిద్ధం చేశామని చెప్పారు. సైలెన్స్ పీరియడ్‌లో ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించుకుందాం

ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న గుజ్జుల ఈశ్వరయ్య

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాముడి పేరుతో లబ్దిపొందాలని చూస్తున్న బిజెపిని ఓడించి ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. శుక్రవారం రాజంపేటలో సిపిఎం, సిపిఐ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు బీజేపీ మాయ మాటలు నమ్మి మోస పోవద్దని రాష్ట్ర అభివృద్ధికి అన్ని రకాలుగా ఆటంకం రాజంపేట పార్లమెంట్ బిజెపి ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని ఓడించాలని కోరారు. ఇండియా వేదిక బలపరుస్తున్న రాజంపేట అసెంబ్లీ అభ్యర్థి అభ్యర్థి బుక్కే విశ్వనాధ్‌నాయక్‌ను కంకి, కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. వైసిపి ఎంపీ మిథున్‌రెడ్డి హయాంలో రాజంపేట అభివృద్ధికి ఏమాత్రం నోచుకోలేదన్నారు. రాజంపేట జిల్లా కేంద్రం చేయడంలో, మెడికల్ కళాశాల కూడా ఇతర ప్రాంతాలకు మిథున్ రెడ్డి వైఫల్యం కారణంగా వెళ్లి పోయాయని అన్నారు. రాజంపేట , రైల్వే కోడూరు ప్రాంతంలో మూత పడిన పరిశ్రమలు తెరిపించడంలో పూర్తిగా వైఫల్యం చెందారని ఆరోపించారు. రాజంపేటకు ఎన్నికల ప్రచారానికి వచ్చినటువంటి జగన్మోహన్ రెడ్డి ఈ ఐదు సంవత్సరాల కాలంలో రాజంపేటకు ఏమి చేయకపోగా మరలా గెలిపిస్తే కేవలం కోడూరు వరకే గాలేరు–నగరి పూర్తి చేస్తానని చెప్పడం దారుణమన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకొని పోయి రెండున్నర సంవత్సరం అయినప్పటికీ ఒక్క ఇటుక పెట్టలేదన్నారు. రాజంపేటకు వైద్య కళాశాల ఇస్తాననడం ఓట్లు దండుకోవడానికేనని అన్నారు. లౌకిక పార్టీ కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రిగా పని చేసిన నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మతతత్వ పార్టీ బిజెపి తీర్థం పుచ్చుకొని పోటీ చేయడం ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అన్నారు. రాజకీయ మార్పు కోసం రాజంపేట నియోజకవర్గ ప్రజలు ఇండియా వేదిక బలపరచిన అభ్యర్థికి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పిఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్, సిహెచ్ చంద్రశేఖర్, సిపిఐ రాజంపేట నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఎంఎస్ రాయుడు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాధవి

అభివృద్ధి చేతగాని జగన్, అంజాద్‌బాషా

- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, కడప అభ్యర్థి మాధవి

ప్రజాశక్తి- కడప అర్బన్

అభివృద్ధి చేతగాని సిఎంగా జగన్ మిగిలిపోయారని, నగరాన్ని నాశనం చేసిన ఎమ్మెల్యేగా అంజాద్ బాషా నిలిచారని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ అభ్యర్థి మాధవి అన్నారు. ద్వారకా నగర్‌లోని ఆయన నివాసం వద్ద శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలనలో అవినీతి, అరాచకం, శాండ్, ల్యాండ్, ఇసుక, లిక్కర్ మాఫియా కొనసాగించిందని మండిపడ్డారు. ఉద్యోగాలు రాక, ఉపాధి లేక అన్ని వర్గాలు నిరాశలో ఉన్నాయని చెప్పారు. రెండు సార్లు గెలిచి నగరాన్ని అభివృద్ధి చేయక, నాశనం చేసిన ఎమ్మెల్యేగా అంజాద్ బాషా ప్రజల్లో కీర్తి గడించారని పేర్కొన్నారు. కేవలం ఆయన ఆర్థిక ఎదుగుదలకు, బందు గణానికి మేలు చేకూర్చడానికి పదేళ్లు ఎమ్మెల్యేగా కొనసాగారని తెలిపారు. కడప నియోజకవర్గ 20ఏళ్ల రాజకీయ చరిత్రలో మాధవికి ప్రజలు విజయం చేకూరుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

కష్టపడిన వారికి న్యాయం చేస్తాం: టిడిపిని అధికారంలోనికి తీసుకువచ్చేందుకు కష్టపడిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ అభ్యర్థి మాధవి అన్నారు. టిడిపి డివిజన్, బూత్ ఇన్చార్జులు, ఏజెంట్లు, కన్వీనర్లు, క్లస్టర్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికులం తామైతే సిద్ధవటం నుంచి వచ్చిన అంజాద్ బాషా, ఆయన తమ్ముడు స్థానికులను కాదనడం హాస్యాస్పదమన్నారు. మహిళ అని కూడా చూడ కుండా బూతులు తిట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. 8 నెలలు ప్రజల్లో తిరిగామని, ఈ రెండు రోజులు ఎంతో కీలకమని చెప్పారు. అంజద్‌బాషా మూడోసారి గెలిస్తే నగరం ప్రమాదంగా మారుతుందని ప్రజలు గ్రహించారన్నారు.

అమీర్ బాబు ప్రచారం: నగరంలోని 25, 31, 39 డివిజన్లలోని యాకుబ్ సాబ్ మజ్జిద్, రాజాఖాన్ మజ్జిద్‌లలో శుక్రవారం నమాజ్ అనంతరం కూటమి కడప ఎంపీ, అసెంబ్లీ అభ్యర్థులు భూపేష్‌రెడ్డి, మాధవిని గెలిపించాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఎస్.అమీర్ బాబు అభ్యర్థించారు. కార్యక్రమంలో కడప నగర టిడిపి ప్రధాన కార్యదర్శి జయకుమార్, టిడిపి పద్మశాలీ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మాసా కోదండ రామ్, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాసర్ అలీ, రఫీక్ ఖాన్, హమీద్ బుఖారీ, ఇమ్రాన్, ఎన్నారై లక్ష్మీ నరసయ్య, వరకుమార్, నాయబ్, తౌఫిక్ పాల్గొన్నారు.

టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావాలి : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రాబోయే ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావాలని మాజీ డిప్యూటీ మేయర్ అరిపుల్లా పేర్కొన్నారు. కడప నగరంలోని బేస్తావీధిలో యువతకు టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఇంటింటికి తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలకు కోరారు.

రాహుల్ గాంధీ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కడప

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 11న కడపకు కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు, రాహుల్ గాంధీ కడపలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారని, సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్. తులసిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బహిరంగ సభ లో రాహుల్ గాంధీ తో పటు ఎఐసిసి జనరల్ సెక్రటరీ కేసి వేణుగోపాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్‌ఛార్జి మాణిక్యం ఠాగూర్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్, ఎఐసిసీ సెక్రటరీ మయ్యప్పన్, కాంగ్రెస్, సిపిఐ సిపిఎం ఆప్‌నాయకులు, వివిధ నియోజకవర్గాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులు పాల్గొంటారని ఆయన తెలిపారు. సమావేశంలో ఏఐసిసి సెక్రటరీ మయ్యప్పన్, ఏపీ సీసీ జనరల్ సెక్రటరీ సత్తార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు, కడప నగర అధ్యక్షులు విష్ణు ప్రితం రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు తిరుమల్ రెడ్డి, శ్యామలమ్మ, పొట్టిపాటి చంద్రశేఖర్ రెడ్డి, చెప్పలి పుల్లయ్య, అలీ ఖాన్, ప్రసాద్, రఫీ, రామకృష్ణారెడ్డి, అమర్, ఉత్తన్న, బాబు, సుబ్బరాయుడు, వినయ్, మాస్, పాల్గొన్నారు .

అభివాదం చేస్తున్న ఇండియా వేదిక నాయకులు

పులివెందులలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పులివెందులలో పోలీసుల కవాతు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

సార్వత్రిక ఎన్నికలు ఈ నెల 13న జరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా శుక్రవారం పోలీసులు కవాతు నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యమన్నారు. పులివెందుల సిఐలు శంకర్‌రెడ్డి, బాల మద్దిలేటి మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అందుకు పోలీసుల సహకారం ఎల్లవేళలా ఉంటుందని భరోసా కల్పిస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో ఎవరైనా గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ అరుణ్‌రెడ్డి, పులివెందుల తాలూకా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

450 మందిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి - ముద్దనూరు

ఎన్నికల వేళ అల్లర్లు సృష్టించి ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ దస్తగిరి, ఎస్ఐ మైనుద్దీన్ హెచ్చరించారు. స్థానిక అప్ గ్రేడ్ పోలీస్‌స్టేషన్ వద్ద శుక్రవారం వారు రౌడీ షీటర్లకు, ప్రజలకు ఇబ్బందులు గురి చేసే వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా నేర చరిత్ర కలిగిన 450 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేలా నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రత్యేక దళాలతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు ఉండాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సెక్టర్ అధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, తహశీల్దార్ భీమేశ్వరరావు ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం 3,4,5,6 సెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ చుట్టూ పరిసరాలు శుభ్రంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రం బయట నీడ కోసం సేమియానా, బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రంలో ఫ్యాన్లు, లైటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. టాయిలెట్లు, తాగునీటి వసతి సౌకర్యాలను కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ హాజీవలి, సెక్టర్ అధికారులు మల్లేశ్వర్ రెడ్డి, శివమోహన్ రెడ్డి, వీఆర్వోలు, బిఎల్వోలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సెక్టర్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి

ప్రశాంత ఓటింగ్‌కు సహకరించండి

మాట్లాడుతున్న డిఎస్‌పి యశ్వంత్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రశాంతంగా ఓటింగ్ జరిగేందుకు మీడియా, రాజ కీయ పార్టీ నాయకులు సహకరించాలని జమ్మల మడుగు రిట ర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాస్ కోరారు. స్థానిక ఆర్‌డిఒ సభా భవనంలో శుక్రవారం పోటీలో ఉన్న అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ శనివారం సాయంత్రం 5గంటలకు అన్ని రాజకీయ పార్టీల, స్వతంత్ర అభ్యర్థులు తమ ప్రచారాన్ని ఆపేయాలన్నారు. శనివారం సాయంత్రం ఐదు గంటల నుంచి 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పోలింగ్‌స్టేషన్‌లోకి పార్టీ కండువాలు వేసు కొని నాయకులు, ఏజెంట్లు, పోటీ చేసే వ్యక్తులు కానీ రావద్ద న్నారు. పోలింగ్ బూత్ ఏజెంట్లను ఇతర పార్టీల వారు అడ్డుకు న్నట్లు సమాచారం వస్తే ఏ రాజకీయ పార్టీ నాయకులైనా ఉపేక్షించబోమన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం నుండి ఆర్థికంగా లాభం పొందుతున్న ప్రజా ప్రతినిధులు, డైరెక్టర్లు, చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీ, ఎంపీపీలు వంటి వారు పోలింగ్ బూత్‌లో ఏజెంట్లుగా కూర్చోరాదన్నారు. రాజకీయ పార్టీల వారికి రెండు వాహనాలు, స్వతంత్రులకు ఒక వాహనానికి మాత్రమే అనుమతి ఉందన్నారు. ఈనెల 13న ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 6 గంటలకు ముగిస్తుందని తెలిపారు. అనంతరం డీఎస్పీ యశ్వంత్ మాట్లాడుతూ గత ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో పోలీస్ బలగాలు 10 శాతం పెరిగాయన్నారు. గుజరాత్, అరుణాచల ప్రదేశ్, తమిళనాడు ఇతర రాష్ట్రాల నుంచి స్పెషల్ ఫోర్సు బలగాలు వచ్చాయన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నప్పుడు బహిరంగ ప్రదేశాల్లో నలుగురికి మించి ఉంటే కఠిన చర్యలు తీసుకుం టామన్నారు. ఏజెంట్ల విషయంలో అభ్యర్థులు చాలా జాగ్రత్తగా ఉండా లన్నారు. ఎక్కడైనా డబ్బు, మందు ఇతర వాటిని పంపిణీ చేస్తా ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ వ్యవస్థ 24 గంటలూ పని చేస్తుందన్నారు. జమ్మలమడుగు నియోజవర్గంలో శని, ఆది, సోమవారాల్లో పోలీస్ రాజ్యం ఉంటుందన్నారు. పార్టీ, అభ్యర్థులను చూసి అడ్డుకునే పరిస్థితి ఉండదన్నారు. జాగ్రత్తగా ప్రతి ఒక్కరూ వ్యవ హరించాలని కోరారు. కార్యక్రమంలో జమ్మల మడుగు తహశీల్దార్ కరుణాకర్, ఎర్ర గుంట్ల తహశీల్దార్ సౌభాగ్యలక్ష్మి, ఎలక్షన్ అధికారులు షఫీ, వేణుగోపాల్ , మస్తాన్‌వలి, వివేకానంద రెడ్డి, నరేంద్ర, అదికారులు పాల్గొన్నారు.

ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- రిటర్నింగ్ అధికారి వెంకటేష్

పులివెందుల టౌన్ : ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశామని మీడియా సమావేశంలో రిటర్నింగ్ అధికారి వెంకటేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలు 119, అత్యంత సమస్యాత్మక గ్రామాలు 05 వాటిలో రాచకుంటపల్లి (169), అలవలపాడు (203), అలవలపాడు (204), కుమారకాల్వ (267), ఎర్ర బొమ్మనపల్లి (269) ఉన్నాయని తెలిపారు. మొత్తం 301 పోలింగ్ బూత్‌లున్నాయని, వీటిలో 120 బూత్‌లో వెబ్ టెలికాస్ట్ చేయడం జరుగుతుందన్నారు. 181 పోలింగ్ బూ త్‌ల్లో వీడియో తీస్తామన్నారు. ఎన్నికల సామగ్రి జేఎన్టీయూ కళాశాలలో ఉన్నా యన్నారు. ఇవిఎంలలో ఏదైనా సమస్య వస్తే వాటిని పర్యవేక్షిం చడానికి 32 సెక్టార్ అధికారులను నియమిం చా మన్నారు. జరిగిందన్నారు. స్వేచ్ఛగా ప్రతి ఒక్కరు ఓటు వేసుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న కాకర్ల షణ్ముఖరెడ్డి

ప్రతి నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కడప ఎంపీ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో ఒక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తానని కడప పార్లమెంటు ఇండిపెండెంట్ అభ్యర్థి కాకర్ల షణ్ముఖరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడప పార్లమెంట్ పరిధిలో 2014 నుండి 24 వరకు పరిపాలన చేసిన ప్రతి నాయకుడు ప్రజలకు ఏమీ చేయలేదని, అభివృద్ధి ఊసే లేదన్నారు. ప్రజా సేవ చేయడానికి ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని, అన్యాయాలు, అక్రమాలపై పోరాడతానని అన్నారు. ఎంపీగా తనను గెలిపిస్తే ప్రతి మండలానికి ఒక డిజిటల్ లైబ్రరీని నిర్మిస్తానన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఆదాయ వనరులు తెప్పించనున్నట్లు వివరించారు. మహిళలకు నిరంతర వృత్తి విద్యా శిక్షణ ఇప్పించి వారి కాళ్లపై వాళ్ల నిలబడేలా చేస్తామన్నారు. పేద ప్రజలకు సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందేలా చూస్తామన్నారు. చట్టసభల్లో కడప ఘాటు కనపడాలంటే మిరపకాయ గుర్తుకు ఓటు వేసి తనను ఎంపీగా గెలిపించాలని కోరారు.

జోరుగా రాజకీయ పార్టీ నాయకుల ప్రచారాలు

ప్రచారంలో పుట్టా సుధాకర్ యాదవ్

ఆదరిస్తే అభివృద్ధి చేసి చూపుతా

ప్రజాశక్తి - చాపాడు

ఈ ఎన్నికల్లో టిడిపిని ఆదరించి, తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మైదుకూరు నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపుతామని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నెర్రవాడ, సోమాపురంలో ఆయన ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టా మాట్లాడుతూ రెండు దఫాలుగా ఓటమి పొందానని, ఈ ఎన్నికల్లో తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గత టిడిపి హయాంలో మైదుకూరు నియోజకవర్గానికి రూ.950 కోట్లు నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి డి.గురివిరెడ్డి, మాజీ జడ్పీటీసీ మేకల బాబు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి, వైవి సుబ్బారెడ్డి, టిడిపి నాయకులు మురళీమోహన్‌రెడ్డి, నాగిరెడ్డి, సుబ్బారెడ్డి, నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ముద్దనూరు :** ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని మండల యువనాయకులు కటికరెడ్డి గుణవంతరెడ్డి ప్రజలను కోరారు. మండల కేంద్రంలోని పలు వీధుల్లో శుక్రవారం కటికరెడ్డి కుటుంబ సభ్యులు, ఎంపిటిసి కాంతమ్మ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జమ్మలమడుగు బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణ రెడ్డి, కడప టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేష్ సుబ్బరామిరెడ్డిని గెలిపించాలని అభ్యర్థిం చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సురేంద్ర నాథ్‌రెడ్డి, మైనార్టీ జిల్లా అధికార ప్రతినిధి అబ్దుల్ ఖాదర్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు రహంతుల్లా, వార్డు మెంబర్ దానం, కర్ణ, వినోద్, ముస్లింలు పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులను గెలిపించాలని మండల టిడిపి నాయకులు మారెడ్డి జయభరత్ రెడ్డి, అజ్జుగుట్ట రఘు నాథరెడ్డి కోరారు. శుక్రవారం మండల పరిధిలోని ముస ల్‌రెడ్డి పల్లెలో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఓటరు ఎన్డీఏ కూటమి బలపరిచిన ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవికి, పార్లమెంట్ అభ్యర్థి భూపేష్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం తథ్యమని కడప పార్లమెంటు ఎన్డీఏ

ప్రచారంలో భూపేష్ రెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

కూటమి అభ్యర్థి భూపేష్‌రెడ్డి, శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి తనయుడు డాక్టర్ రాంరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కాంబల్లె గ్రామంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రవేశపెట్టిన మేనిఫెస్టో అన్ని వర్గాల అభ్యున్నతికి ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ వైసిపి ఏ మాత్రం పట్టించుకోవడంలేదని వారు విమర్శించారు. తమకు ఒకసారి అవకాశం ఇస్తే జిల్లాలోని ప్రధాన సమస్యలను పరిష్కారానికి పార్లమెంట్‌లో గళం విప్పి తప్పకుండా పరిష్కరిస్తామన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పివిఆర్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం

- దళితవాడలో దేవాలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

చాపాడు : మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలో వైసిపి నాయకులు, కాత్యాయని కన్స్ట్రక్షన్ ఎండి పెద్దిరెడ్డి వెంకట రమణారెడ్డి (పివిఆర్ఆర్) ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా

గ్రామస్తులకు చెక్‌ను అందజేస్తున్న పివిఆర్ఆర్

ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డిలను మళ్లీ గెలిపించాలని కోరారు. అనంతరం దళితవాడలో రామాలయ నిర్మాణానికి సహకరించాలని ప్రజలు కోరగా.. అందుకు ఆయన స్పందిస్తూ రూ.5 లక్షలు విరాళంగా చెక్కు అందజేశారు. అనంతరం తప్పెట వెంకటశివ, ఎల్.వెంకటశివ, టి.చలపతి, లక్ష్మమయ్య, ఓబులేసు, సునీల్ వైసిపిలో చేరారు. కార్యక్రమంలో చెన్నకేశవ స్వామి దేవస్థానం చైర్మన్ నిరంజన్‌రెడ్డి, వైసిపి నాయకులు రాజేంద్రనాథ్‌రెడ్డి, భద్రారెడ్డి, శివ ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఖాజీపేట :** రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని, ప్రతి ఒక్కరు టిడిపికి ఓటు వేసి గెలిపించాలని పత్తూరు ఉప సర్పంచ్ ముత్తూరు రమణ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని పత్తూరు పంచాయతీలో మైదుకూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్‌కు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం ఇవిఎంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయుకులు జి గంగినాయుడు, జానకి రామ్ నాయుడు, రమేష్, జి గంగాధర్, డి అబదరసూల్, టి రామయ్య(పోటీ రామయ్య), చంద్రయ్య, సి రాముడు, జి రెడ్డయ్య, రమణ, రామానాయుడు, సింగరయ్య, పిపి నారాయణ, నరసింహ, బలగంగాధర్, సి గంగయ్య, డి.నాగేశ్వరావు, మల్లికార్జున, శ్రీను పాల్గొన్నారు.

ప్రచారంలో పాల్గొన్న టిడిపి నాయకులు

మాట్లాడుతున్న రాచమల్లు ప్రసాద్‌రెడ్డి

అభివృద్ధిని చూసి ఓటేయండి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

తన హయాంలో ప్రొద్దుటూరులో జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని వైసిపి అభ్యర్థి రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమారం జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఒక్కసారి ఆలోచించి ఓటు వేయాలన్నారు. ప్రజలకు శాశ్వితంగా తాగునీటి సమస్యను పరిష్కరించానన్నారు. నూతన కూరగాయల మార్కెట్ పనులు 45 శాతం పూర్తయ్యాయన్నారు. ఆర్టీసి బస్టాండ్ ఆధునీకరణ పనులు జరుగుతున్నాయన్నారు. రామేశ్వరం-ఆర్టీపిపి బ్రిడ్జి పనులు, ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. రోడ్లు, కాలువలు ఏర్పాటు చేశామన్నారు. రాచమల్లు కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునే ముందు ఆలోచించాలని కోరారు. వరదరాజులరెడ్డి 25 సంవత్సరాలు అధికారంలో ఉన్నారని, 10 సంవత్సరాలు అధికారపక్షం మొత్తం 35 సంవత్సరాలు ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. వరద అభివృద్ధి నిరోధకుడన్నారు. అభివృద్ధి కావాలంటే రాచమల్లుకు ఓట్లేసి గెలిపించాలన్నారు. సమావేశంలో రాచమల్లు రాఘవేంద్రారెడ్డి పాల్గొన్నారు.

పాలిసెట్‌లో 80 శాతం ఉత్తీర్ణత

- ప్రిన్సిపల్ పాలెం గురుమూర్తిరెడ్డి

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో పాలిసెట్-24కు ఉచిత శిక్ష తీసుకున్న విద్యార్థుల్లో 80 శాతం ఉత్తీర్ణులయ్యారని కళాశాల ప్రిన్సిపల్ పాలెం గురుమూర్తిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్‌కు 2024-25 విద్యా సంవత్సరానికి ఆరు ఇంజనీరింగ్ బ్రాంచ్‌లు (కంప్యూటర్ అండ్ ఐటీ, ఈఈఈ, సివిల్, మెకానికల్, కెమికల్, మెటలర్జికల్) కుగాను ఆల్ ఇండియా టెక్నికల్ ఎడ్యుకేషన్, న్యూఢిల్లీ వారిచే ఆమోదం పొడిగింపబడిందని సంతోషం వ్యక్తం చేశారు. తమ కళాశాలలో మంచి అధ్యాపకులు ఉన్నారని, మూడు సంవత్సరములు డిప్లొమా పూర్తి అయిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అన్నారు. డిప్లమో తర్వాత బీటెక్ చేయుటకు ఈసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. డిప్లమాలో ఇంజనీరింగ్ చేయుటకు ఆసక్తిగల విద్యార్థుల తల్లిదండ్రులకు తాను, అధ్యాపక సిబ్బంది వారి ఇళ్లకు వెళ్లి పాలిటెక్నిక్ కోర్సులు పట్ల అవగాహన కూడా కల్పించినట్లు తెలిపారు. కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో చేర్చి వారి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని ప్రిన్సిపల్ గురుమూర్తి రెడ్డి తెలిపారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ గురుమూర్తిరెడ్డి

గాలివానకు తెగిపడిన విద్యుత్ లైన్లు

అంధకారంలో పి.బొమ్మేపల్లె - ఆదుకోవాలి : బాధితురాలు లక్ష్మీదేవి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మండలంలోని పి.బొమ్మేపల్లి గ్రామంలో గురు వారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. గునకొనపల్లి లక్ష్మీదేవి అనే మహిళ ఇల్లు గాలివానకు లేచిపోయాయి. అర కిలోమీటరు దూరంలో రేకులు పడ్డాయి. అదృష్టవశాత్తూ ఇంట్లో ఉన్న లక్ష్మీదేవి, ఆమె మనవడు గాలి శబ్దానికి భయపడి వారి పక్క ఇంటికి వెళ్లిపోతున్న సమయంలో ఇంటి పైకప్పు రేకులు గాలికి లేచిపోయాయి. ఇంట్లో ఫ్యాను రేకులతోపాటు గాలికి కొట్టుకుపోయింది. టివి వర్షంతో దెబ్బతింది. నిత్యవసర వస్తువులు తడిసిపోయాయి. బియ్యం మూట తడిసిపోయింది. కర్రు రఘునాథరెడ్డి వీధిలో కర్రు పెద్ద బాలిరెడ్డి ఇంటి వద్ద ఉన్న కరెంటు స్తంభం లైన్ తెగిపోయింది. గుణకనపల్లి ప్రతాప్ రెడ్డి ఇంటి వద్ద కరెంట్ లైన్స్ పెనవేసుకున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామం రాత్రంగా చీకట్లోనే ఉన్నింది. ఉప్పలూరి వెంకటరామిరెడ్డి బోద కొట్టం గోడ గాలి, ఉరుములకు నేల కొరిగింది. బొమ్మేపల్లి పంచా యితీలోని ఒంటిమిద్దె గ్రామంలో దళితవాడకు చెందిన చింతాకు నడిపి సుబ్బరాయుడు ఇంటిమీద వేప చెట్టు విరిగిపడింది. బాధితురాలు జి.లక్ష్మీదేవి మాట్లాడుతూ తనకు దాదాపు రెండు లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదు కోవాలని కోరారు. విద్యుత్తు లైన్లు పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరారు.

గాలికి ఎగిరిపోయిన రేకులు, ఇంటి మీద పడిన వేపచెట్టు

సిసి రోడ్లకు నోచని ఎస్‌సి కాలనీలు

సిమెంటు రోడ్డులేని జోసఫ్‌పేట

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు పరిధిలో ఉన్న జోసఫ్‌పేట, శాంతినగర్ కాలనీలలు సిమెంట్ రోడ్లకు నోచుకోలేదు. తమ కాలనీల్లో సిపి రోడ్లు కూడా ఏర్పాటు చేయలేని పరిస్థితిలో పాలకులు, అధికారులు ఉన్నారని స్థానికులు వాపోతున్నారు. ఆయా కాలనీల్లో పూర్తిగా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారున్నారు. బద్వేల్ రోడ్డులోని ఆయా కాలనీలు కొండపేట కాలువ వెంబడి ఉన్నాయి. సిసి రోడ్లు లేకపోవడంతో వర్షాకాలంలో ప్రజలు నానా అవస్థలు పడాల్సిన వస్తోంది. మున్సిపాలిటీ ఏర్పడి తొమ్మిదేళ్లు కావస్తున్నా నేటికీ సిమెంటు రోడ్లు లేవని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ ఇంటి పన్ను, నీటి పన్నులు మాత్రం ప్రతి ఏడాది పెంచుకుంటూ పోతూ ప్రజల మీద భారం వేస్తున్నారు. మైదుకూరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం గత ప్రభుత్వ హయాంలో రూ.9.5 కోట్లు నిధులు మంజూరు కాగా.. వాటిని ఖర్చు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమై రూ.3.5 కోట్లు మాత్రమే పనులు చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో సిమెంట్ రోడ్లు లేని ప్రాంతాలు, డ్రయినేజీకి నోచుకోని వార్డులు అనేకం ఉన్నాయి. 2012లో నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీ 2014లో మొదటిసారిగా ఎన్నికలు జరిగాయి. వార్డు కౌన్సిలర్లు, చైర్మన్ నూతన ఉత్సాహంతో వార్డులను అభివృద్ధి చేయాల్సింది పోయి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న విధంగా తయారైంది. ఆ రెండు కాలనీల్లో పందుల సంచారం ఎక్కువగా ఉంది. దుర్వాసనతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు జోసఫ్‌పేట, శాంతి నగర్ కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న సిమెంట్ రోడ్లను ఏర్పాటు చేసి, డ్రయినేజీ కాలువలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పందులు సంచరించకుండా చర్యలు తీసుకుని, ప్రజారోగ్యాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్ పాండురంగన్ రవి

ఎస్ఆర్ఐటిలో వీడ్కోలు సంబరాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్, డిప్లమో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ పాండురంగన్ రవి మాట్లాడుతూ బీటెక్ విద్యార్థులు కోర్సు పూర్తయిన తర్వాత ఉన్నత ఉన్నత ఉద్యోగాలు సాధించి అటు తల్లిదండ్రులకు, ఇటు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. డిప్లమో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ డిప్లమో పూర్తి అయిన తర్వాత బీటెక్‌లో చేరి ఉత్తమ ఫలితాలు సాధించి కోర్సు పూర్తి చేసుకోవాలన్నారు. సీనియర్ విద్యార్థులు మాట్లాడుతూ తమకు ఉత్తమ విద్యను అందించిన అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. సీనియర్లు జూనియర్లు కలిసి తమ అనుభూతులను పంచుకొని ఆటపాటలతో, కేక్ కట్ చేసుకుని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి, కరెస్పాండెంట్ వీరకళ్యాణ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్ రెడ్డి, హెచ్ఓడిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పులివెందులలో టిడిపి జెండా ఎగురవేస్తాం

సింహాద్రిపురం : సార్వత్రిక ఎన్నికల్లో పులివెందులలో టిడిపి జెండా ఎగరవేయడం ఖాయమని ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి బీటెక్ రవి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గురజాల ఎస్సీ కాలనీలో ఆయన రోడ్డు షో నిర్వహించారు. ఎన్నికల్లో కష్టపడిన ప్రతి కార్యకర్తకు అధికారంలోకి రాగానే తగిన గుర్తిం పునిస్తామన్నారు. ప్రతి ఓటరు ఈసారి తమకు అవకాశం కల్పిస్తే పులివెందులను ఎంతో అభివృద్ధిలోకి తీసుకెళ తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెయిల్ మంజూరుపై హర్షం

- ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు స్వీట్లు పంపిణీ

ప్రజాశక్తి - వేంపల్లె

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రివాల్‌కు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ ఇవ్వడం హర్షణీయమని ఆమ్‌అద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు దాదాపీర్ పేర్కొన్నారు. ఢిల్లీ సిఎం కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు కావడంతో శుక్రవారం వేంపల్లెలోని నాలుగు రోడ్ల కూడలిలో వారు ప్రజలకు స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రహమతుల్లా మాట్లాడుతూ 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా వేదికలో ఉన్న ఆప్‌ను ఎదురుకోలేని మోడీ ప్రభుత్వం కేసులు పెట్టిందన్నారు. బిజెపి ఆరాచకాలను అరికట్టాలంటే ఇండియా వేదిక విజయం సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఆప్ వేంపల్లి మండల సభ్యులు పిరుబాషా, ఖదీర్, అహమద్, షామీర్, ఆశీర్వాదం పాల్గొన్నారు.

స్వీట్స్ పంపిణీ చేస్తున్న రహంతుల్లా

FORMAT C-1

Declaration about Criminal Cases

Name and Address of candidate : **Y. MAHESH REDDY,S/o Y. RAMAKRISHNA REDDY, 34 Years, resident of Door No. 14-19-1, Pyarampalli (V), Jarravaripalli (P), Vayalpad (M), Annamayya District, A.P**

Name of the political party : **INDEPENDENT**

(Independent candidates should write "Independent" here)

Name of the Election : **LEGISLATIVE ASSEMBLY ANDHRAPRADESH – 2024**

Name of the Constituency : **163–PILERU ASSEMBLY CONSTITUENCY**

I, Y. MAHESH REDDY, a candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antcendents :

Pending Criminal cases

Sl.No.	Name of Court	Case No. and date	Status of case(s)	brief description of offence(s)
1	In the Court of the Assistant Sessions Judge Court, Piler	SC/53/ 2017	307, 326, 324	**For Arguments**

(B) Details about cases of conviction for criminal offences

S.No.	Name of Court and dates of orders	Description of offence & punishment imposed	Maximum punishment imposed
1	**NIL**	**NIL**	**NIL**

Y. MAHESH REDDY

ప్రణాళికాబద్ధంగా ఎన్నికల నిర్వహణ

అన్నమయ్య జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రాయచోటి

రాబోయే మూడు రోజులు చాలా కీలకమని పక్కా ప్రణాళిక, పటిష్టమైన సూక్ష్మ కార్యాచరణతో ఎన్నికలను విజయవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి యం.అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, ఎంపిడిఒలు,సెక్టోరల్ అధికారులు, విద్యుత్‌శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ఇప్పటివరకు ఎంతో జాగ్రత్తగా ఆయా అంశాల ప్రక్రియలను పూర్తి చేసుకున్నామని అన్నారు. 72 గంటల ప్రోటోకాల్ ప్రకారం నిఘా, ప్రవర్తన నియమావళి సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు. జిల్లా ఎన్నికల అధికారులు ఒక బృందంలా పనిచేయాలని, ఏదైనా సమస్య వచ్చినప్పుడు అందరూ సమస్య పరిష్కారంలో భాగం కావాలని సూచించారు. నిష్పక్షపాతంగా ఉంటూ పోలింగ్ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని సూచించారు. రిటర్నింగ్ అధికారులు, ఎంపి డిఒలు, పోలీసులు 72 గంటల ప్రోటోకాల్ అమలులో కీలకంగా వ్యవహరించాలన్నారు. 11న సాయంత్రం 6 గంటలకు ఎన్నికల ప్రచారం ముగుస్తుందని అన్నారు. 48 గంటల ముందుగా అన్ని లాడ్జిలు, కళ్యాణ మండపాలు, హోటళ్లు, పబ్లిక్ గుమికూడే ప్రదేశాలలో పోలీసులతో కలిసి ఎంపిడిఒలతో కలిసి స్వయంగా తనిఖీలు చేయాలని తెలిపారు. ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, పోలీస్ చెక్ పోస్టులను తనిఖీలు చేయాలన్నారు. ఇంటర్ స్టేట్ బోర్డర్ చెక్‌పోస్టులపై ప్రత్యేక నిఘా ఉంచాలని, పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల వ్యవధిలో లౌడ్ స్పీకర్లు, బహిరంగ ప్రచారాలు, ఎలక్ట్రానిక్ ఛానల్స్‌లో ప్రచారాలు, బల్క్ ఎస్ఎంఎస్‌లు అనుమతించబడవని, ప్రింట్ మీడియాలో ప్రచారానికి ఎంసిఎంసి కమిటీ మీడియా సర్టిఫికేషన్ పొందాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద నూరు మీటర్ల పరిధిలో ఎలాంటి ప్రచారం చేయరాదని, రాజకీయ ప్రచార సామాగ్రి పోస్టర్లు, బ్యానర్లు ఉండకూడదని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో ర్యాంప్, టాయిలెట్, త్రాగునీరు, క్యూపై షేడ్ ఏర్పాటు ఉండేలా తహశీల్దార్లు, సెక్టార్ అధికారులు చర్యలు తీసుకో వాలన్నారు. వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు ప్రాథమిక చికిత్స అవసరమయ్యే మందులు ఉంచుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ బాగా పని చేయాలని, ఏదైనా సాంకేతిక సమస్య వస్తే వెంటనే పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. డ్రైనర్‌లో పిడిఎంఎస్, వెబ్ కాస్టింగ్ అంశాలను తనిఖీ చేసుకోవాలని చెప్పారు.రహస్య ఓటింగ్ పద్ధతికి భంగం కలిగిస్తూ ఓటింగ్ కంపార్ట్మెంట్ నందు వీడియోలు ఫోటోలు తీయరాదని అభ్యర్థులు ఓటు వేసిన పిదప నూరు మీటర్ల పరిధిలో ఎలాంటి ఇంటర్వ్యూలు చేయకూడదని చెప్పారు. నియోజకవర్గంలోని కంట్రోల్ రూములు నేటి నుంచి 14 వరకు అప్రమత్తంగా ఉండాలిన్నారు.గత అనుభవాలను కూడా దృష్టిలో ఉంచుకొని ఎక్కడ ఎలాంటి చిన్న పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా పోలింగ్ ప్రక్రియ నిర్వహణలో పారదర్శకంగా విధులు నిర్వహించి ఎన్నికల విజయవంతానికి కలిసికట్టుగా పనిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్హాన్అహ్మద్ ఖాన్, డిఆర్ఒ సత్యనారాయణరావు, రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, ఎంపిడిఒలు, సెక్టోరల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అభిషిక్త్ కిషోర్

మద్యం దుకాణంలో స్టాక్ వివరాలను పరిశీలిస్తున్న నోడల్ అధికారి

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

ప్రజాశక్తి-పీలేరు

ఎన్నికల నియమావళి, నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని అన్నమయ్య జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం నోడల్ అధికారి చంద్రనాయక్ తెలిపారు. కలెక్టరు ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన తన బృందంతో కలిసి పీలేరు పట్టణంలోని ఓ రెస్టారెంట్ బార్‌ను, గుర్రమిట్టలో మద్యం దుకాణంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కలిసిన స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం నడుచుకోవాలని సంభంధిత సిబ్బందికి సూచనలు జారీ చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఎలాంటి చిన్న పొరపాట్లకు కూడా తావివ్వకుండా చూసు కోవాల్సిందిగా సిబ్బందిని ఆదేశించామని పేర్కొన్నారు. మద్యం నియంత్రణ కోసం జిల్లాలోని చెక్ పోస్టుల్లో కస్మిక తనిఖీలు చేయ డమే కాకుండా మదనపల్లిలోని మద్యం డిపోను కూడా తనిఖీ చేస్తూ, ఎప్పటి కప్పుడు జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకు వెళుతున్నట్లు చెప్పారు. మద్యం వ్యాపారానికి సంబంధించిన రిజిస్టర్ల ద్వారా నిల్వ ఉన్న మద్యాన్ని సిబ్బంది సహాయంతో నిశితంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట పీలేరు డిప్యూటీ తహశీల్దారు జయసింహ, ఎక్సైజ్ ఎస్ఐ పెక్టర్ రామకృష్ణ శాస్త్రి, పోలీస్ ఎస్ఐ గాయత్రి, జిఎస్‌టిఒ అధికారి హేమంత్‌కుమార్, బృంద సభ్యులు సుధాకర్, విజయ్, రెడ్డినాయక్ పాల్గొన్నారు.

బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

'అన్నమాచార్య'లో ఘనంగా నేషనల్ టెక్నాలజీ డే

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బోయనపల్లిలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో నేషనల్ టెక్నాలజీ డేను టచ్ స్టోన్ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 'ఇంటిగ్రేటెడ్ అప్రోచ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సస్టేయినబుల్ ఫ్యూచర్'అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. బిటెక్ తృతీయ సంవత్సరం ఎఐడిఎస్ చదువుతున్న పి.సుజిత మొదటి బహుమతి సాధించగా, బిటెక్ తృతీయ సంవత్సరం ఎఐడిఎస్ వి.స్వాతి ద్వితీయ బహుమతి, బిటెక్ సిఎస్ఇ మొదటి సంవత్సరం చదువుతున్న వి.శ్రీనిధి ప్రియ తృతీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపల్ ఎస్ఎంవి నారాయణ తెలిపారు. అనంతరం కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చొప్పా అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి వక్తృత్వ పోటీలలో పాల్గొనడం వలన తమ లోని సృజనాత్మకతను వెలికి తీయ వచ్చని అన్నారు. కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికోసం తమ కళాశాలలో అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు వాటిసన్నింటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరో హించా లని సూచించారు. కార్యక్రమంలో హెచ్ అండ్ ఎస్ విభాగాధిపతి డాక్టర్ బి.బాలనాగేంద్ర ప్రసాద్, టచ్‌స్టోన్ ఇన్ చార్జ్ పి.విజయ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అవకాశమిస్తే అభివృద్ధి చేస్తా :'మండిపల్లి'

ప్రజాశక్తి-చిన్నమండెం

రాయచోటి టిడిపి అసెంబ్లీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చిన్నమండెం టౌన్‌లోని ప్రధాన రహదారి వెంబడి రోడ్‌షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు,ముస్లిములు గజమాలతో స్వాగతం పలికారు. ప్రజలకు అందరికీ అభివాదం తెలుపుతూ ఈసారి టిడిపిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. తనకు ఒక అవకాశం ఇవ్వాలని అభివృద్ధి అంటే ఎంతో చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు.

అంతర్జాతీయ సెమినార్‌లో 'మిట్స్' విద్యార్థుల ప్రతిభ

ప్రతిభ కనబరచిన విద్యార్థులతో ప్రిన్సిపల్ యువరాజ్

ప్రజాశక్తి-మదనపల్లి

తమిళనాడులోని మెట్టలలో గల లోయలా కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ సైన్స్ జరిగిన అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో మిట్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రతిభ చాటారని కళాశాల ప్రిన్సిపల్ సి.యువరాజ్ తెలిపారు. కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు, అధ్యాపకులు తమిళనాడులోని మెట్టలలో గల లోయలా కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ సైన్స్ జరిగిన అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌కు హజరు య్యారని చెప్పారు. 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఎంబ్రేసింగ్ ది డిజిటల్ హారిజన్ పయనీరింగ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్ట్రాటజీస్ ఫర్ ఎ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఫ్యూచర్ ఇడిహెచ్2024' లో పర్యవేక్షించబడిన, పర్యవేక్షించబడని మెషిన్ లెర్నింగ్ ఉపయోగించి మధుమేహం అంచనా అనే అంశంపై పరిశోధనలు చేశారని చెప్పారు. పరిశోధన గురించి వివరించిన విద్యార్థులకు ఉత్తమ పేపర్ అవార్డును అసిస్టెంట్ ప్రొఫెసర్స్ శాయాజ్అహ్మద్, ఉష, కుమార్‌లకు అవార్డు లభించిందని ఆయన అన్నారు. సుమారు 24 మంది విద్యార్థులు వివిధ పరిశోధనలతో ప్రతిభ కనబరిచారని అన్నారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులను, అధ్యాపకులను కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్‌చౌదరి, విభాగాధిపతి డాక్టర్ కల్పనా అభినందనలు తెలిపారు.

సూపర్ సిక్స్ పథకాలతో విజయం సాధిస్తాం

టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ రూపొందించిన సూపర్ సిక్స్ పథకాలతోనే జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ విజయం సాధిస్తాడని టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపం పథకం గృహిణులకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తామని, నాలుగు వేలు రూపాయల పింఛను ఇంటి వద్దకే ఒకటో తేదీనే పంపిణీ చేస్తామని చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు 50 సంవత్సరాలకే పింఛన్ అందిస్తామని, కూటమి సమిష్టి కృషితో అభ్యర్థి గెలుపుకు అన్ని వర్గాల వారు సహకరిస్తున్నారని అన్నారు. ప్రచారానికి ఏ గ్రామానికి వెళ్లిన గ్రామస్తులు బ్రహ్మరథం పడుతున్నారని ఇదే విజయానికి సంకేతమని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహిళకు కరపత్రాలు అందిస్తున్న కూటమి నాయకులు

'సిబిఎస్ఇ' అనుమతులు మంజూరు

ప్రజాశక్తి-గాలివీడు

మండలకేంద్రంలోని స్థానిక రవిచంద్ర పాఠశాలకు సిబిఎస్ఇ తరగతుల నిర్వహణ కోసం 2024-25 సంవత్సరానికి సెంట్రల్ బోర్డ్ అనుమతులు మంజూరు చెయ్యడం హర్షదాయకమని పాఠశాల యాజమాన్యం షింటో ఇమ్మనుయేల్,సైజు థామస్ పేర్కొన్నారు.ఈవిద్యాసంవత్సరంలో 1 నుంచి 12 వ తంగతి వరకు సిబిఎస్ఇలో ప్రవేశాలకు ఆహ్వానం పలుకుతున్నట్లు స్పష్టం చేశారు. బోధనలో పాఠశాల జ్ఞానం,నైపుణ్యాలు, విలువల వైఖరులపై దృష్టి పెట్టడం జరుగుతుందన్నారు. విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి దోహదపడేలా మౌలిక, అత్యాధునిక సౌకర్యాలు కల్పించామన్నారు. పిల్లల ఎదుగుదల, అభివృద్ధిని సులభతరం చేయడానికి అర్హత, శిక్షణ పొందిన ఫ్యాకల్టీ ఏర్పాటు చెయ్యడంతో పాటు పాఠ్యాంశాలలో ఉన్నవాటిని నిజ జీవితానికి అనుసంధానించే విధంగా ప్రోత్సహిస్తున్నామని అన్నారు.

ఐటిఐలో దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక శ్రీటిఎన్ వెంకట సుబ్బారెడ్డి మెమోరియల ప్రభుత్వ ఐటిఐలో ప్రవేశాల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఫిట్టర్, ఎలక్ట్రిషన్, సివిల్ ట్రేడ్లలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు పదవ తరగతి, ఇంటర్మీడియట్ పాస్ లేక ఫెయిల్ అయిన అభ్యర్థులు ఈనెల 9వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో iti.ap.gov.Inలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అనంతరం అభ్యర్థి 10వ తరగతిలో ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని ఐటిఐలో వెరిఫికేషన్ చేసుకోవాలని తెలిపారు. వెరిఫికేషన్ చేసుకున్న వారు మాత్రమే అడ్మిషన్ అర్హత పొందుతారని అన్నారు. జూన్ 6 లోపు రిజిస్ట్రేషన్ చేసుకుని వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

పివి.రావు ఆశయ సాధనకు పాటుపడదాం

ప్రజాశక్తి-పీలేరు

అణిచివేతకు గురౌతున్న మాలలందరినీ ఐక్యం చేసి చైతన్యపరిచేందుకు మాలమహానాడు వ్యవస్థాపకుడిగా గుర్తింపు తెచ్చుకుని, మాల జాతి కోసం పాటుపడిన పివి రావు ఆశయాలను కొనసాగించేలా చూద్దామని మాల మహానాడు నాయకులు తెలిపారు. రాయలసీమ జిల్లాల సహాయ కార్యదర్శి నగరిమడుగు సుభాష్, జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున ఆధ్వర్యంలో శుక్రవారం పీలేరు మాల మహానాడు మండల కార్యాలయంలో పివి రావు 75వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, మండల అధ్యక్షులు గుండ్లూరు రవీంద్ర, నాయకులు మాట్లాడుతూ దళితుల అభివృద్ధి కోసం పాటుపడిన ఏకైక వ్యక్తి పివి రావు అని, ఎ,బి,సి,డి వర్గీకరణ చేస్తే దళితులు నష్టపోతారని అన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు సీనియర్ నాయకులు కె.గట్టప్ప, మండల కార్యదర్శి తముకు ప్రబుతేజ, సహాయ కార్యదర్శులు దప్పేపల్లి ఆనంద్, పాటూరి నాగేంద్ర పాల్గొన్నారు.